www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల : 5.00

Published from: Karimnagar, Circulated to: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి : 2 | సంచిక : 1 | శనివారం | 15 జూన్ 2024



ప్రపంచ కప్ నుంచి పాకిస్థాన్ ఔట్ 8 లో..

# కేసీఆర్ వివరణపై ఉత్కంఠ



## విద్యుత్ కొనుగోళ్లపై నోటీసులు

### నేటితో ముగియనున్న గడువు

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ :** తెలంగాణలో విద్యుత్ కొనుగోలు, కొత్త ప్రాజెక్టుల నిర్మాణ టెండర్లపై ఎల్.నరసింహారెడ్డి కమిషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌ను వివరణ కోరింది. దీంతో ఆయన నిర్ణయంపై ప్రస్తుతం సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. పార్లమెంట్ ఎన్నికలకు ముందే కేసీఆర్‌కు కమిషన్ నోటీస్ జారీ చేసింది. అయితే పార్లమెంట్ ఎన్నికలు ఉన్నందున జులై 30వ తేదీ వరకు వివరణకు అవకాశం ఇవ్వాలని కోరారు. అయితే కమిషన్ మాత్రం జూన్ 15వ తేదీ వరకు గడువు ఇచ్చింది. ఈ గడువు శనివారంతో మ-ుగియనుండంతో కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకుంటారో అన్న విషయం హాట్ టాపిక్‌గా మారింది. ఎన్నికలు ముగియడం తో ఈ అంశంపై లిఖిత పూర్వక వివరణ పంపించేందుకు న్యాయ నిపుణులతో కేసీఆర్ సంప్రదింపులు జరుపుతున్నారు. లిఖిత పూర్వక వివరణ పంపించేందుకు కేసీఆర్ తర్జన భర్జన పడుతున్నట్లు సమాచారం. గడువులోగా ఆయన నుంచి సమాధానం రాకపోతే కమిషన్

మిగతా 2 లో



## ఇటలీలో బిజీగా ప్రధాని మోడీ

### పలు దేశాధినేతలతో వరుస భేటీలు


**న్యూఢిల్లీ, జూన్ 14 :** లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత తొలిసారి విదేశీ పర్యటనకు వెళ్లిన ప్రధాని నరేంద్రమోదీ వరుస సమావేశాలతో బీజీగా ఉన్నారు. ఇటలీ వేదికగా జరుగుతోన్న జీ7 దేశాల సదస్సులో భారత్ ఆహ్వానిత దేశంగా పాల్గొంది. ఈసందర్భంగా జీ7 దేశాల అధినేతలతో ఆయన వరుస ద్వైపాక్షిక సమావేశాల్లో పాల్గొంటున్నారు. బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మేక్రాన్‌తో సంభాషించారు. అలాగే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, మోదీ మధ్య కూడా భేటీ జరిగింది. ఈ విషయాన్ని ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం విషయంలో పశ్చిమదేశాల ఒత్తిడిని అధిగమించి, భారత్ స్వతంత్ర వైఖరిని ప్రదర్శించింది. చర్చలు, దౌత్యమార్గాల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచిస్తూనే.. రష్యా వ్యతిరేకంగా ఐరాసలో జరిగిన ఓటింగ్‌కు పలుమార్లు దూరంగా ఉంది. ఇదిలాఉంటే.. ప్రస్తుత సమావేశంలో పుతిన్ సేనలతో జరుగుతోన్న ఘర్షణకు సంబంధించి పలు అంశాలను మోదీకి జెలెన్ స్కీ వివరించినట్లు సమాచారం. ఇక ఈ జీ7 సదస్సులో ఈ యుద్ధం గురించే చర్చ జరిగింది. ఫ్రీజ్ చేసిన

మిగతా 2 లో



## కవితతో కేటీఆర్ ములాఖాత్

తీహార్ జైలుకు వెళ్లి కలిసిన మాజీ మంత్రి 2 లో..



## కాంగ్రెస్ హామీలు నీటిమూటలు

2 లో..

మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు

## గొర్రెల పంపిణీ స్కామ్‌పై ఈడీ దూకుడు

ఇప్పటికే ఆరుగురు అధికారులు అరెస్టు 2 లో..

## ఆధార్ అప్‌డేట్‌కు మూడు నెలల గడువు

2 లో..

గడువును పొడిగించిన ఉడాయ్



## ధరణి పోర్టల్‌ను పునర్ వ్యవస్థీకరణ

- బీఆర్ఎస్ తీరుతో ఎందరికో నష్టం
- బాధితులందరికీ న్యాయం చేస్తాం
- ధరణి కమిటీ సభ్యులతో మంత్రి పొంగులేటి సమీక్ష

2 లో..

## కువైట్‌లో మరణించిన వారి మృతదేహాలు తరలింపు

కేరళకు చేరుకున్న 45 మంది భౌతిక కాయాలు 2 లో..



## పక్క రాష్ట్రాన్ని చూసి రేవంత్ నేర్చుకోవాలి

2 లో..

బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి



2 లో..

## రుణమాఫీ అందరికీ వర్తింపజేయాలి

- రాష్ట్రంలో 70 లక్షల మందికిపైగా రైతులు
- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి డిమాండ్

## పోలీసులకు చిక్కిన ఆన్‌లైన్ వ్యభిచార ముఠా

3 లో..

పార్క్ హోటల్‌పై దాడిచేసి పట్టివేత



## ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు
- నారా లోకేశ్‌కు ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్
- అచ్చన్నాయుడుకు వ్యవసాయ శాఖ
- పయ్యావుల కేశవ్‌కు ఆర్థిక
- వంగలపూడి అనితకు హోం మంత్రిత్వ శాఖ
- నాదెండ్ల మనోహర్‌కు పౌర సరఫరాల శాఖ
- సత్యకుమార్‌కు వైద్యారోగ్య శాఖలు కేటాయింపు
- మంత్రులకు శాఖల కేటాయించిన చంద్రబాబునాయుడు

2 లో..



## మూడు నెలల ఎత్తిపోతలకు ఇన్ని వేల కోట్లు ఖర్చా

- గోదావరిలో నీరుండగా ప్రాణహితలో ఎందుకు ప్రాజెక్ట్?
- కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ సూటి ప్రశ్నలు

2 లో..




## నీట్ అవకతవకలపై సీబీఐ విచారణ

2 లో..

సుప్రీంలో మరో పిటిషన్ దాఖలు

జులై 8న అన్నీ కలిపి విచారిస్తామన్న ధర్మాసనం

# రుణమాఫీ అందరికీ వర్తింపజేయాలి

- రాష్ట్రంలో 70 లక్షల మందికిపైగా రైతులు
- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి డిమాండ్

**హైదరాబాద్, ప్రజానావ:** ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి యోజన ప్రాతిపదికగా ప్రభుత్వం రుణమాఫీ అమలు నిర్ణయంపై మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఫైర్ అయ్యారు. రుణమాఫీ అందరికీ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వ ఆంక్షలు గర్హనీయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం మూడు విడుతల్లో ఇచ్చేది రూ.6 వేలు మాత్రమేనన్నారు. రాష్ట్రంలో 70 లక్షల మందికిపైగా రైతులు ఉండగా, కేంద్రం గరిష్టంగా 36.1 లక్షల మంది రైతులకే అమలు చేసిందని వెల్లడిరచారు. కేసీఆర్ హయాంలో ఎలాంటి ఆంక్షలు లేకుండా 70 లక్షల మంది రైతులకు రైతుబంధు ఇచ్చామని చెప్పారు. ఇందులో భాగంగా 11 విడుతల్లో రైతుల ఖాతాల్లో రూ.72,910 కోట్లు జమచేశామని తెలిపారు. యాసంగిలో ఎకరాకు రూ.5 వేలు అరకొరగా ఇచ్చి కాంగ్రెస్ సర్కార్ చేతులు దులుపుకున్నదని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని తెలిపారు. సాగునీళ్లు, కరెంటు, పంటల కొనుగోళ్లలో రైతాంగాన్ని ఇబ్బందిపెడుతున్నారని ఆరోపించారు. అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసినందుకు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# కేసీఆర్ వివరణపై సర్వత్రా ఉత్కంఠ



(మొదటిపేజీ తరువాయి)

ఏ నిర్ణయం తీసుకుంటుందోనన్న విషయంపై ఆశక్తి రేపుతోంది. గడువును పొడిగిస్తుందా? లేక సమన్లు జారీ చేస్తుందా? అన్నది తెలియాలంటే మరో 24 గంటలు ఆగాల్సిందే. కాగా మూడు అంశాల విచారణ కొనసాగుతోందని పవర్ కమిషన్ చీఫ్ జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నోటీసుల్లో పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్లాంట్లపై విచారణ కొనసాగుతోందని అన్నారు. టెండర్ల ప్రక్రియ లేకుండా ఒప్పందాలు జరిగాయని, 25 మందికి నోటీసులు ఇచ్చామని నరసింహారెడ్డి పేర్కొన్నారు. కాగా మాజీ సీఎం కేసీఆర్ మాత్రం ఇంకా సమాధానం ఇవ్వలేదని, సమయం కావాలని కోరారని వివరించారు. మాజీ సీఎండీ, ప్రస్తుత సీఎండీలతో సమావేశం అయ్యామని తెలిపారు. సోమవారం మాజీ సీఎండీ ప్రభాకర్ రావు, నాటి ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ చందాతో సమావేశం అయ్యామని నరసింహా రావు వివరించారు. మూడు నిర్ణయాలు అప్పటి ప్రభుత్వం మాత్రమే తీసుకుందని పవర్ కమిషన్ చీఫ్ జస్టిస్ ఎల్.నరసింహా రెడ్డి పేర్కొన్నారు. జెన్‌కోకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. ఎస్‌కే జోషి, అరవింద్ కుమార్‌లతో మంగళవారం సమావేశం అయ్యామని చెప్పారు. అరవింద్ కుమార్ అప్పుడే రేగ్యులేటరీ కమిషన్‌కు లేఖ రాశారని, అయితే పట్టించుకోలేదని అన్నారు. రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం జరిగినప్పుడు కేంద్రానికి అధికారం ఇవ్వాలని, అయితే రెండు రాష్ట్రాల ఒప్పందంతో ఛత్తీస్‌ఘఢ్‌కు అధికారం ఇచ్చారని పేర్కొన్నారు. భారీగా నిధులు ఖర్చు చేసి పవర్ కొనుగోలు చేశారని, మొత్తం ప్రక్రియలో ఎంత నష్టం అనేది తేల్చాల్సి ఉందని నరసింహా రెడ్డి పేర్కొన్నారు. ఇక భద్రాద్రిలో సబ్ క్రిటికల్ టెక్నాలజీని పెట్టారని, అంతటా సూపర్ క్రిటికల్ టెక్నాలజీ పెట్టారని నరసింహా రెడ్డి వివరించారు. యాదాద్రిలో నామినేషన్ బేస్‌లో ఇచ్చారని, ఇంకా పూర్తి కాలేదని అన్నారు. ఆగస్టు వరకు ఒక ల్కైన్ అందుబాటులోకి వస్తుందని అంటున్నారు కానీ రైల్వేల్కైన్ వెయ్య లేదని పేర్కొన్నారు. అధికారుల నుంచే కాకుండా ప్రముఖులు నుంచి కూడా సమాచారం తీసుకుంటున్నామని అన్నారు.

# కాంగ్రెస్ హామీలు నీటిమూటలు

**మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శలు**

**హైదరాబాద్, ప్రజానావ :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామిలు నీటి మూటలను తలపిస్తున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హామీలు అమలు చేస్తామని బాండ్ పేపర్ల మీద రాసిచ్చిన కాంగ్రెస్ పార్టీ, 191 రోజులు గడిచినా ఆచరణలో మాత్రం విఫలమైందని విమర్శించారు. పక్క రాష్ట్రం ఏపీలో అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి అన్ని రకాల పింఛన్లు పెంచితే, ఒడిశా ముఖ్యమంత్రి వరి కనీస మద్దతు ధర క్వింటల్‌కు రూ.3100 చేస్తూ నిర్ణయం తీసుకున్నారని హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరవాలని హితవుపలికారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లుగా వృద్ధులు, వితంతువుల పింఛన్లు రూ.4 వేలు, దివ్యాంగులకు 6 వేలు పెంచుతూ తక్షణమే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. 10 శాతం మాత్రమే పండించే సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తామని చేతులు దులుపుకున్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామిలో చెప్పినట్లుగా అన్ని రకాల వడ్లకు బోనస్ ఇస్తామని ప్రకటించాలని బీఆర్ ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీలు, 13 హామిలను అమలు చేయాలన్నారు.

# మూడు నెలల ఎత్తిపోతలకు ఇన్ని వేల కోట్లు ఖర్చా

- గోదావరిలో నీరుండగా ప్రాణహితలో ఎందుకు ప్రాజెక్ట్
- కాళేశ్వరంపై జస్టిస్ పిసి ఘోష్ సూటి ప్రశ్నలు

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ** మూడు నెలల వరద నీరు ఎత్తిపోయడానికి ఇంత ఖర్చు అవసరమా..? అని కాళేశ్వరం కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించారు. జలసౌధలో కాళేశ్వరంపై ఆయన పలువురు ఇంజినీర్లు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను కమిషన్ ప్రశ్నించింది. గోదావరిలో నీళ్లుండగా ప్రాణహిత నుంచి ఎత్తిపోయాల్సిన అవసరం ఏమొచ్చిందని అడిగింది. ప్రాణహిత–చేవెళ్ల నిర్మాణంపై ఐదుగురు సభ్యుల కమిటీ ఇచ్చిన నివేదికను తమకు అందించాలని సూచించింది. రిటైర్డ్ ఇంజినీర్లు ఇచ్చిన రిపోర్ట్‌ను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలపై విచారణకు హాజరైన వారి నుంచి జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ అఫిడవిట్లు తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఈ నివేదికలు 27న అందనున్నాయి. ఇప్పటికే ఇంజినీర్లు, పలు నిర్మాణ సంస్థలకు సంబంధించి ప్రతినిధులను కమిషన్ ప్రశ్నించింది. వచ్చే నెల 7న ఎన్డీఎస్ఏ, సీడబ్ల్యూపీఆర్, సీఎస్ఎంఆర్ఎస్ నివేదికలు కమిషన్ కు అందనున్నాయి.

ప్రధానంగా ఆర్థిక అంశాలపైనే దృష్టి సారించిన కమిషన్ ప్రతి అంశాన్నీ ప్రశ్నిస్తోంది. వాళ్లు ఇచ్చే వివరణను అఫిడవిట్ల రూపంలో తీసుకోనుంది.

# నీట్ అవకతవకలపై సీబీఐ విచారణ

- సుప్రీంలో మరో పిటిషన్ దాఖలు
- జూలై 8న అన్నీ కలిపి విచారిస్తామన్న ధర్మాసనం

**న్యూఢిల్లీ, జూన్ 14:** ఎంబీబీఎస్, బీడీఎస్.. ఇతర వైద్య కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్)– యూజీ 2024పై పెద్ద ఎత్తున వివాదం చెలరేగిన క్రమంలో, దీనిపై సుప్రీంకోర్టులో మరో పిటిషన్ దాఖల్కెంది. నీట్ పరీక్షలో పేపర్ లీక్, ఇతర అక్రమాలపై సీబీఐ దర్యాప్తు చేపట్టాలని పిటిషనర్ అభ్యర్థించారు. ఈ విచారణ సందర్భంగా కోటా ఆత్మహత్యల ప్రస్తావన తీసుకురాగా.. సర్వోన్నత న్యాయస్థానం సున్నితంగా మందలించింది. నీట్ పరీక్షలో అక్రమాల ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు కోరుతూ దాఖల్కెన పిటిషన్‌పై సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ శుక్రవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన ఓ న్యాయవాది.. రాజస్థాన్‌లోని కోటా నగరంలో విద్యార్థుల వరుస ఆత్మహత్యల అంశాన్ని ప్రస్తావించారు. దీనికి ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేసింది. కోటాలో ఆత్మహత్యలకు నీట్ యూజీ 2024 ఫలితాలతో సంబంధం లేదు. ఇలాంటి అనవసర, భావోద్వేగ వాదనలు ఇక్కడ చేయొద్దని సూచించింది. అనంతరం ఈ పిటిషన్‌పై రెండు వారాల్లోగా తమ స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి సుప్రీం నోటీసులు జారీ చేసింది. వీటితో పాటు సీబీఐ, బిహార్ ప్రభుత్వానికి కూడా ధర్మాసనం నోటీసులిచ్చింది. దీనిపై తదుపరి విచారణను జుల్కె 8వ తేదీకి వాయిదా వేసింది. నీట్ పరీక్షకు సంబంధించి దాఖల్కెన ఇతర పెండిరగ్ పిటిషన్లతో కలిపి దీన్ని విచారిస్తామని స్పష్టం చేసింది. బిహార్‌లో నీట్ ప్రశ్నాపత్నం లీకైనట్లు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది నీట్ ప్రవేశ పరీక్ష మే 5న దేశవ్యాప్తంగా 4,750 కేంద్రాల్లో జరిగింది. దాదాపు 24 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి 67 మంది విద్యార్థులు 720కి 720 మార్కులు సాధించారు. హరియాణాలోని ఒకే పరీక్షా కేంద్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులకు తొలి ర్యాంక్ రావడంతో అనుమానాలు తలెత్తాయి. ఇంత మంది టాప్ ర్యాంకును పంచుకోవడం వెనుక గ్రేస్ మార్కులు కారణమని ఇటీవల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలోనే 1563 మంది విద్యార్థులకు కేటాయించిన గ్రేస్ మార్కులను రద్దు చేస్తున్నట్లు కేంద్రం సుప్రీంకోర్టు తెలిపింది. 2019 నుంచి ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఏకంగా 67 మందికి 720కి 720 మార్కులు రావడం, టాపర్లుగా నిలవడంతో నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు మొదలయ్యాయి. ఇప్పటివరకు నీట్ యూజీలో ఒక్కసారి కూడా ముగ్గురికి మించి టాపర్లు లేరు. 2019, 2020లో ఒక్కొక్కరు చొప్పున టాపర్లుగా నిలిచారు. 2021లో ముగ్గురు, 2022లో ఒక్కరు, 2023లో ఇద్దరు టాప్ స్కోరు సాధించారు. కానీ, ఈసారి అసాధారణ రీతిలో 67 మంది టాపర్లుగా నిలవడం, వీరిలో హర్యానాలో ఒకే సెంటర్‌లో పరీక్ష రాసిన ఆరుగురు ఉన్నారనే వార్తలు రావడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రుల్లో అనుమానాలు మొదలయ్యాయి. ఈ అంశంపై విద్యార్థులు దేశవ్యాప్తంగా పలు చోట్ల ఆందోళనలు చేపట్టారు.

# కువైట్‌లో మరణించిన వారి మృతదేహాలు తరలింపు

**కొచ్చి, జూన్ 14:** కువైట్‌లోని అల్ మంగాఫ్‌లో బుధవారం జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో 49 మంది కార్మికులు మరణించిన సంగతి తెలిసిందే. వారిలో 45 మందిని భారతీయులుగా గుర్తించారు. ఇప్పుడు ఆ మృతదేహాలను వాయుసేన విమానంలో కేరళలోని కొచ్చి అంతర్జాతీయ విమానాశ్రయానికి తీసుకువచ్చారు. శుక్రవారం ఉదయం ఆ విమానం భారత్‌కు చేరుకుంటుందన్న సమాచారంతో బాధిత కుటుంబాలు ఎయిర్‌పోర్టుకు వచ్చాయి. దాంతో ఆ ప్రాంతమంతా ఉద్విగ్నంగా మారిపోయింది. అలాగే కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కేంద్రమంత్రి సురేశ్ గోపి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రన్‌తో పాటు పలువురు విమానాశ్రయంలో ఉన్నారు. మృతదేహాలను తరలించేందుకు భారత వాయుసేన గురువారం రాత్రి ఓ విమానాన్ని కువైట్ చేరుకొంది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ప్రభుత్వం.. అక్కడి పరిస్థితుల్ని పర్యవేక్షించేందుకు, మృతదేహాలను సాధ్యమైనంత త్వరగా స్వదేశానికి తీసుకువచ్చేందుకు కేంద్రమంత్రి కీర్తివర్ధన్‌ను అక్కడకు పంపింది. మృతుల్లో 23 మంది కేరళవాసులు కాగా.. ఏడుగురు తమిళనాడుకు చెందిన వారు ఉన్నారు. ఏపీకి చెందినవారు ముగ్గురు. ఒక కర్ణాటక వ్యక్తి ఉన్నారు. మిగిలిన వారు ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు.

# గొర్రెల పంపిణీ స్కామ్‌పై ఈడీ దూకుడు

**ఇప్పటికే ఆరుగురు అధికారులు అరెస్టు**

**ఖైరతాబాద్, ప్రజానావ:** గొర్రెల పంపిణీ స్కామ్‌పై ఈడీ దూకుడు పెంచింది. ఇప్పటికే ఈ కేసులో ఆరుగురు అధికారులు అరెస్టు అయ్యారు. ఇప్పుడు ఈడీ జోక్యంతో ఇంకా ఎలాంటి పరిణామాలు జరుగుతాయో అన్న ఆసక్తి నెలకొంది. ఈడీ కేసు నమోదు చేసి 24 గంటలు కాకముందే తెలంగాణలోకి ఎంట్రీ ఇచ్చారు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు. గొర్రెల పంపిణీ స్కామ్‌లో కేంద్రంగా మారిన పశుసంవర్ధక శాఖ కార్యాలయానికి చేరుకున్నారు. ఇప్పటికే ఆ శాఖ అధికారులకు లేఖ రాసిన ఈడీ అధికారులు... పలు వివరాలు సేకరించే పనిలో ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గొర్రెల పంపిణీలో అక్రమాలు జరిగినట్టు తేల్చింది. అవినీతి నిరోధక శాఖను రంగప్రవేశంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వెయ్యికోట్లకుపైగా అవినీతి జరిగినట్టు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి ఆరుగురు అధికారులను అరెస్టు చేశారు. ఏసీబీ దర్యాప్తు ఆధారంగా ఇందులో మనీలాండరింగ్ జరిగినట్టు నిర్ధారించుకున్న తర్వాత ఈడీ జోక్యం చేసుకొని కేసు నమోదు చేసింది. దీంతో ఇది ఎవరి మెడకు చుట్టుకుంటుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# ఆధార్ అప్‌డేట్‌కు మరో మూడు నెలల గడువు

**గడువును పొడిగించిన ఉడాయ్**

**హైదరాబాద్, ప్రజానావ:** ఆధార్‌ను వినియోగదారులు ఉచితంగా అప్‌డేట్ చేసుకోవడానికి గడువును మరో మూడు నెలల వరకూ పొడిగిస్తున్నట్లు యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఉడాయ్) ప్రకటించింది. గతంలో ఇచ్చిన గడువు శుక్రవారం నాటికి ముగియడంతో ఈ తుది తేదీని మరో 3 నెలలు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని ఉడాయ్ తన అధికారిక వెబ్‌సైట్‌లో ప్రకటించింది. పెరిగిన గడువు ప్రకారం దేశంలోని ప్రజలు తమ ఆధార్ కార్డులోని వివరాలను 14 సెప్టెంబరు 2024 వరకూ ఉచితంగా అప్‌డేట్ చేసుకోవచ్చు. ఆధార్ గుర్తింపు కార్డుల్లో చాలా ముఖ్యమైన డాక్యుమెంట్ కావడంతో బ్యాంకు ఖాతా ప్రారంభించడం దగ్గర నుండి వృద్ధాప్య పింఛను వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు లబ్దిదారుడిగా గుర్తించేంత వరకూ ఉపయోగపడుతోంది. అలాగ్ బస్ టిక్కెట్ బుకింగ్ నుండి ఎయిర్ బస్ టిక్కెట్ వరకూ, పాఠశాలల్లో అడ్మిషన్ల నుండి పెద్ద పెద్ద కంపెనీల్లో ఉద్యోగంలో చేరేంత వరకూ ఆధార్ కీలకంగా మారింది. జననం నుండి మరణం వరకూ ప్రతీ దశలోనూ, ప్రతి విషయానికీ ఆధార్ ఎంతో ఉపయోగకరంగా ఉంటోంది. ఒక విధంగా చెప్పాలంటే ఆధార్ కార్డు అనేది ఒక వ్యక్తికి జాతక చక్రంగా మారింది. దీనిలో ఆ వ్యక్తి పేరు, జండర్, చిరునామా, వయస్సు, ఐరిష్, బయోమెట్రిక్ సమాచారం పూర్తిగా నిక్షిప్తమై ఉంది. ఆధార్‌కు ఉన్న ప్రాముఖ్యత కారణంగా, దానిని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవడం ఎంతో ముఖ్యం. వ్యక్తిగత వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోకపోతే సదరు వ్యక్తి జాతకమే మారిపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం నుండి ప్రైవేటు సంస్థల వరకూ ఎటువంటి ప్రయోజనం పొందాలన్నా ఆధార్ అవసరం. అలాగే ఆధార్ అప్‌డేట్ కూడా అందే అవసరం. ఆధార్ కార్డు తీసుకొని 10 సంవత్సరాలు దాటి ఉంటే అలాంటి వ్యక్తులంతా వీలైనంత త్వరగా వివరాలను అప్‌డేట్ చేయాలని పౌరులందరికీ ఉడాయ్ సూచించింది. వివరాలను నవీకరించడానికి అసరమైన డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆధార్ ఉచితంగా అప్‌డేట్ చేసే సదుపాయం ఆన్‌లైన్‌లో మాత్రమే అందుబాటులో ఉంది. ఒకవేళ ఆధార్ కేంద్రానికి వెళ్ళి వివరాలను నవీకరించుకోవాలంటే అందుకు కొంత ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

# ధరణి పోర్టల్‌ను పునర్వ్యవస్థీకరణ

- బీఆర్ఎస్ తీరుతో ఎందరికో నష్టం
- బాధితులందరికీ న్యాయం చేస్తాం
- ధరణి కమిటీ సభ్యులతో మంత్రి పొంగులేటి సమీక్ష



**ఖైరతాబాద్, ప్రజానావ:** గత భారాస ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్ వల్ల రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు భూసమస్యలను ఎదుర్కొంటున్నారని, ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ సమస్యల నుంచి ఉపశమనం కలిగించడానికే ధరణి పోర్టల్‌ను పునర్వ్యవస్థీకరించి, భూ వ్యవహారాలకు సంబంధించిన చట్టాల్లో మార్పులు తేవాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఆ దిశగా ఇప్పటికే చర్యలు చేపట్టామని తెలిపారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో ధరణి కమిటీ సభ్యులతో మంత్రి పొంగులేటి సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'గత ప్రభుత్వం హడావుడిగా ఎలాంటి అధ్యయనం చేయకుండా ఈ పోర్టల్‌ను తీసుకొచ్చింది. దీంతో ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారు. వాటిని పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ధరణిని ప్రక్షాళన చేసేందుకు సత్వర చర్యలు తీసుకుంటున్నాం. ఈ పోర్టల్ అమలు కారణంగా వచ్చిన సమస్యలను అధ్యయనం చేసేందుకు ఐదుగురు సభ్యులతో కమిటీ వేశాం. ఈ కమిటీ ఇచ్చిన సిఫారసులపై సమావేశంలో చర్చించాం. కమిటీ తుది నివేదిక ప్రభుత్వానికి ఇచ్చే ముందే అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహిస్తాం'అని తెలిపారు. ఈ కమిటీ రాష్ట్రంలో భూసంబంధిత నిపుణులు, అధికారులతో చర్చించడంతోపాటు 18 రాష్ట్రాల్లోని ఆర్‌వోఆర్ యాక్ట్‌ను క్షుణ్ణంగా పరిశీలించిందని మంత్రి తెలిపారు. భూ వివాదాల పరిష్కారం కోసం రెవెన్యూ ట్రైబ్యునల్‌లను ఏర్పాటు చేయాలని, భూమికి సంబంధించిన ముఖ్యమైన చట్టాలను కలిపి ఒకే చట్టంగా రూపొందించాలని కమిటీ సూచించినట్లు చెప్పారు. ధరణి పోర్టల్‌ను బలోపేతం చేయడంతోపాటు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా, అందరికీ సులువుగా అర్థమయ్యే విధంగా మార్పులు చేపట్టబోతున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం పార్ట్–బిలో ఉంచిన భూ సమస్యలను పరిష్కరించానికి ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని మంత్రి పొంగులేటి తెలిపారు.

# ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్

**అమరావతి, ప్రజానావ:** ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా కొలువైన మంత్రివర్గంలో చేరిన మంత్రులకు శాఖల కేటాయింపు జరిగింది. దీంతో ఎవరికి ఏయే శాఖలు అనేదానిపై ఇంతవరకూ నెలకొన్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. శుక్రవారం మధ్యాహ్నం మంత్రులకు శాఖలు కేటాయిస్తూ సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఇందులో జనసేన అధినేత పవన్ కల్యాణ్, యంగ్ లీడర్ నారా లోకేష్‌లకు కీలక శాఖలు ఇవ్వడం జరిగింది. అంతేకాదు.. యంగ్ మినిస్టర్లకు కీలక బాధ్యతలే చంద్రబాబు అప్పగించారు. ఇక హోం మంత్రి ఎవరవుతారనే దానిపై చంద్రబాబు పెద్ద ట్విస్టే ఇచ్చారు. ఎవరూ ఊహించని రీతిలో మహిళ, అందులోనూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వంగలపూడి అనితకు కేటాయించడం విశేషమని చెప్పుకోవచ్చు. అనుకున్నట్లుగానే పవన్ కళ్యాణ్‌కు డిప్యూటి సిఎంతో పాటు గ్రావిరీణాభివృద్ధిని కేటాయించారు. జనసేనలో మరో నేత నాదెళ్ల మనోహర్‌కు పౌరసరఫరాల శాఖ కేటాయించారు. వైకాపా ప్రభుత్వంలోనూ మహిళకే హోంశాఖ కేటాయించారు. దీనినే చంద్రబాబు కూడా కొనసాగించారు. మంత్రుల శాఖలు ఇలా ఉన్నాయి.

# ఇటలీలో బిజీగా ప్రధాని మోడీ

(మొదటిపేజీ తరువాయి)

రష్యన్ ఆస్తుల్ని ఉపయోగించి ఉక్రెయిన్‌కు 50 బిలియన్ల డాలర్లు రుణం ఇచ్చేందుకు అమెరికా ప్రతిపాదన చేసింది. దీనికి సభ్యదేశాలు తమ అంగీకారం తెలిపా యి. రక్షణ, అంతరిక్ష, విద్య, డిజిటల్ పబ్లిక్ ఇన్ఫ్రాస్టక్చర్ వంటి రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా మోదీ , మేక్రాన్ చర్చలు జరిపారు. దాంతోపాటు పలు కీలక విషయాలపై తమ మధ్య చర్చ జరిగినట్లు మోదీ వెల్లడించారు.

# కవితతో కేటీఆర్ ములాఖాత్

**న్యూఢిల్లీ, జూన్ 14 :** తీహార్ జైలులో ఉన్న ఎమ్మెల్సీ కవితతో ఆమె సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ములాఖత్ అయ్యారు. కవిత యోగక్షేమాలను ఆయన అడిగి తెలుసు కున్నారు. ఢిల్లీ మద్యం పాలసీ స్కామ్ కేసులో అరెస్టు అయిన కవిత ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్నారు. కవితను బయటకు తీసుకురావడం కోసం ఆమె కుటుంబం ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తూనే ఉంది. కానీ ఆ ప్రయత్నాలన్నింటికీ దర్యాప్తు సంస్థలు బ్రేకులు వేస్తూనే ఉన్నాయి. ఎప్పుడు బెయిల్ కోసం ఆమె తరుఫు న్యాయవాదులు న్యాయస్థానాన్ని ఆశ్రయించినా కూడా దర్యాప్తు సంస్థలు కొత్త విషయాలను వెలుగులోకి తీసుకు వస్తున్నారు. దీంతో బెయిల్ వాయిదా పడుతూనే ఉంది.

# ఐసెట్ ఫలితాలు విడుదల

**హైదరాబాద్, ప్రజానావ:** తెలంగాణ ఐసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆర్ లింబాద్రి, కాకతీయ యూనివర్సిటీ ఇంచార్జి వీసీ వాకాటి కరుణ ఇద్దరూ కలిసి శుక్రవారం నాడు ఫలితాలను విడుదల చేశారు. అభ్యర్థులు తమ రిజిస్ట్రేషన్ నెంబర్, హాల్ టికెట్ నెంబర్, బర్త్ డేట్ ఆధారంగా అధికారిక వెబ్ సైట్ లో ఫలితాలను తెలుసుకోవచ్చు. కాగా, ఈ ఫలితాల్లో 91.92 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 5, 6 తేదీల్లో ఐసెట్–2024 ఎగ్జామ్ నిర్వహించారు. ఐసెట్ కోసం మొత్తం 86,156 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వీరిలో 71, 647 మంది ఉత్తీర్ణులయ్యారు. ఐసెట్ ఫలితాల కోసం అధికారిక వెబ్‌సైట్ క్లిక్ చేయొచ్చు.

# పక్క రాష్ట్రాన్ని చూసి రేవంత్ నేర్చుకోవాలి

**బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి**

**హైదరాబాద్, ప్రజానావ:** సీఎం రేవంత్‌రెడ్డి పక్క రాష్ట్రాన్ని చూసి నేర్చుకోవాలని బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలల్కెనా హామీలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం, ముఖ్యమంత్రికి మూడు రోజుల క్రితం లేఖ రాశానని తెలిపారు. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 'ఏపీలో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన కొన్ని గంటల్లోనే వృద్ధాప్య పెన్షన్లను 2 వేల నుంచి 4 వేలు పెంచుతూ సంతకం పెట్టారు. తెలంగాణలో వృద్ధాప్య పెన్షన్లు 4 వేలు చేస్తానని రేవంత్ అన్నారు. ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు అయింది. సర్కార్ బడుల్లో ఫస్ట్ క్లాస్ నుంచి టెన్త్ వరకు పంపిణీ చేసే పుస్తకాలు విద్యార్థులకు ఇచ్చి మళ్లీ తీసుకున్నారు. రాష్ట్ర ఖజానాపై మరో భారం పడుతుంది. వ్యక్తిగత కారణాలతో ప్రజా ధనాన్ని వృథా చేస్తే ఊరుకోం. అధికారుల నిర్లక్ష్యం వల్ల కేసీఆర్ బొమ్మ పుస్తకాలపై వచ్చి ఉండొచ్చు, వారి పై చర్యలు తీసుకోవాలి. కానీ ఇచ్చిన పుస్తకాలు తీసుకోవద్దు. పుస్తకాలపై జాతీయ గీతం ఉందని తెలిసింది దాన్ని తీసేయడం మంచి పద్ధతి కాదు. ఏపీలో గత ముఖ్యమంత్రి బొమ్మ ఉన్న పుస్తకాలు పిల్లలకు ఇచ్చారు. అధ్యక్షుడి మార్పుపై బీజేపీ నిర్ణయం తీసుకుంటుంది. ప్రజలు బీఆర్ఎస్, కాంగ్రెస్ అవినీతిని చూశారు. ప్రజలు మా వైపు ఉన్నారు. ఏ స్కాం జరిగిన దానిపైన విచారణ జరుగుతుందని తెలిపారు.



# జులై 7నుంచి ఆషాఢ బోనాలు

**గోల్కొండ ఉత్సవాలతో ప్రారంభం**

**హైదరాబాద్, ప్రజానావ:** ఏటా జరిగే ఆషాఢ బోనాలు జులై7న ప్రారంభం కానున్నాయి. గోల్కొండ బోనాలతో బోనాల ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ప్రతీ సంవత్సరం ఆషాఢ మాసంలో అమావాస్య తర్వాత వచ్చే గురువారం లేదా ఆదివారం గోల్కొండ కోట పై గల శ్రీ ఎల్లమ్మ(జగదాంబిక) ఆలయంలో బోనాల ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఈసారి ఆషాఢంలో అమావాస్య జులై 5న వస్తుంది. తరువాత వచ్చే ఆదివారం జులై 7 నుంచి బోనాల ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇక్కడ మొదటి పూజ జరిగిన తర్వాత తెలంగాణ లోని ఇతర ఆలయాల్లో బోనాల ఉత్సవాలు ప్రారంభమవుతాయి. గోల్కొండ తర్వాతనే సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి, లాల్ దర్వాజ మహంకాళి ఆలయంలో పూజలు జరుగుతాయి. ఆషాఢమాసంలో చివరి రోజు గోల్కొండ కోటలోనే చివరి బోనం పూజ జరుగుతుంది. దీంతో బోనాల ఉత్సవాలు సమాప్తం అవుతాయి. గోల్కొండ కోటపై గల శ్రీఎల్లమ్మ(జగదాంబిక) ఆలయంలో జులై 7నుంచి నెల రోజుల వరకు ప్రతీ గురువారం, ఆదివారం బోనాలు ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఇక్కడ తొమ్మిది ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ పూజలకు నగరం నలు మూలల నుంచే గాక, ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, నల్గొండ, వరం గల్, కరీంనగర్ జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు వస్తారు. గోల్కొండ బోనాల ట్రస్ట్‌బోర్డు కమిటీ పదవీకాలం ముగియడం తో దేవాదాయ శాఖ అధికారులు నూతన కమిటీ ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. రెండు, మూడు రోజుల్లో నోటిఫికేషన్ విడుదలవుతుందని వారు తెలిపారు. ట్రస్ట్‌బోర్డు అధ్యక్ష పదవికి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇప్పటికే చాలామంది రాష్ట్ర మంత్రులను కలుస్తూ తనకు అవకాశం కల్పించాలని కోరారు.

# జులై 6న బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం

**భారీగా ఏర్పాట్లు చేస్తున్న ఆలయ అధికారులు**



**హైదరాబాద్, ప్రజానావ:** బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణం జులై 9న వైభవంగా జరుగనుంది. వీటిని ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు. జులై 8న ఒగ్గు కళాకారులతో పుట్టమన్ను తెప్పించడంతో పాటు ఎస్ఆర్‌నగర్ వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ఎదుర్కోళ్లు, (శాక్తేయముగా) నిర్వహిస్తూ ఎల్లమ్మ దేవాస్థానం వరకు ఊరేగింపుగా రావడంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 9న ఆలయానికి తూర్పు ముఖంగా ఏర్పాటు చేసిన రేకుల షెడ్డులో అమ్మవారి కల్యాణం నిర్వహిస్తారు. 10వ తేది 6 గంటలకు కల్యాణం వీక్షించేందుకు రాష్ట్ర నలు మూలల నుంచి వచ్చే భక్తులతో రథోత్సవ కార్యక్రమం ఉంటుంది. దీంతో ఉత్సవాలు ముగుస్తాయి. గత సంవత్సరం నిర్వహించిన కల్యాణానికి భక్తులకు ఎలాంటీ అసౌకర్యాం కలుగకుండా మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ నెల రోజుల ముందుగానే వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించేవారు. ఈ సారి మాత్రం కల్యాణ సమయం దగ్గర పడుతున్నా ఏర్పాట్లు, ఆలయ సుందరీకరణపై ఆలయ చైర్మన్, అధికారులు పెద్దగా దృష్టి సారించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈవో నాగరాజు లాంగ్ లీవ్‌లో ఉండడం ఇన్‌చార్చి ఈవోగా బాధ్యతలు తీసుకున్న జ్యువెల్లరీ ఇన్‌స్పెక్షన్ అధికారి(జేవివో) అంజలి దేవి ఏర్పాట్లపై దృష్టి సారించాలని కోరుతున్నారు. గత సంవత్సరం అమ్మవారి కల్యాణం వీక్షించేందుకు అంచనాలకు మించి భక్తులు 10 లక్షల మంది విచ్చేశారు. ఈ సారి కూడా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేయనున్న నేపథ్యంలో సౌకర్యాలపై అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది.

# తెలంగాణను రోల్ మోడల్‌గా నిలబెడతాం

**మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి**



**నల్లగొండ, ప్రజానావ:** రాబోయే నాలుగున్నరేళ్లలో తెలంగాణను దేశానికి రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మూడు -నాలుగేళ్లలో మూసీ నదిని సుందరీకరిస్తామని చెప్పుకొచ్చారు. వచ్చే మూడేళ్లలో విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తెస్తామని స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లా బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు పంప్ హౌస్, ప్రాజెక్టు రిజర్వాయర్ లను మంత్రి కోమటిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రగతి భవన్, ఫామ్ హౌస్ కే పరిమితమైన మాజీ సీఎం కేసీఆర్ చదువు గురించి ఏనాడూ పట్టించుకోలేదని మండిపడ్డారు. విద్యారంగంపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకమైన దృష్టి పెట్టిందని.. పాఠశాలల నుండి విశ్వవిద్యాలయం వరకు విద్యావ్యవస్థను పటిష్ట పరచడమే ప్రభుత్వం ముందున్న ధ్యేయమని చెప్పుకొచ్చారు. తెలంగాణ ఏర్పడి పదేళ్లైనా అసలైన రాష్ట్రం డిసెంబర్ 3 న వచ్చిందని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు.

# భారీ వర్షంతో వాగులో గల్లంతయిన రైతు

**వికారాబాద్, ప్రజానావ:** వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్‌లో భారీ వర్షం కురిసింది. వర్షాలకు జిల్లాలోని వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల చెట్లు విరిగిపడి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాగా, మేకవనం పల్లి గ్రామం నుంచి అమ్రదికుర్దు వెళ్లే దారిలో ఉధృతంగా ప్రవహిస్తున్న బండ్ల వాగులో పడి ఓ రైతు గల్లంతయ్యాడు. వాగు దాటే సమయంలో బైక్‌తో సహా మొహతాజ్ అలీ అనే రైతు కొట్టుకుపోయాడు. స్థానికులు వాగులో గాలింపు చర్యలు చేపట్టగా శుక్రవారం ఉదయం మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మర్పల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడు అమ్రదికాలన్ గ్రామానికి చెందిన మొహతాజ్ అలీగా గుర్తించారు.

# కృష్ణా జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- కంటెయినర్‌ను ఢీకొన్న లారీ.. ఆరుగురు దుర్మరణం
- క్షతగాత్రులకు మంత్రి కొల్లు రవీంద్ర పరామర్శ
- మృతుల కుటుంబాలకు 5లక్షల చొప్పున సాయం ప్రకటన



**విజయవాడ, ప్రజానావ:** కృష్ణా జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు కృత్తివెన్ను మండలం సీతనపల్లి వద్ద హైవేపై లారీ, కంటైనర్ ఢీకొన్నాయి. లారీ కృష్ణా జిల్లా బంటుమిల్లి వైపు, కంటైనర్ పుదుచ్చేరి నుంచి భీమవరం వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందారు. మృతుల్లో ఇరు వాహనాల డ్రైవర్లతో పాటు మరో నలుగురు ఉన్నారు. ఘటనాస్థలంలోనే ఐదుగురు చనిపోగా.. ఆస్పత్రికి తరలిస్తుండగా మరొకరు మృతిచెందారు. మృతులను కాకినాడ జిల్లా గొర్రిపూడి గ్రామానికి చెందిన గండి ధర్మవర ప్రసాద్ (27), అమలాపురానికి చెందిన పేసింగు కనకరాజు (34), కాట్రేనికోనకు చెందిన చింతా లోవరాజు (32), మాగపు సోమరాజు (30), ఎస్ యానాంకు చెందిన రేవు నాగభూషణం (26), తమిళనాడుకు చెందిన కంటైనర్ డ్రైవర్ అయ్యప్పన్ (42)గా గుర్తించారు. ప్రమాద సమయంలో కృష్ణా జిల్లా బంటుమిల్లి వైపు వెళ్తున్న లారీలో డ్రైవర్‌తో పాటు 10 మంది ప్రయాణికులున్నారు. కంటైనర్‌లో డ్రైవర్‌తో పాటు ఓ ప్రయాణికుడు ఉన్నారు. కర్రల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి ప్రమాదం జరిగినట్లు సమాచారం. చేపలు పట్టేందుకు వెళ్తూ వీరంతా ప్రమాదానికి గురైనట్లు పోలీసులు వెల్లడించారు. మృతదేహాలను మచిలీపట్నం ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ నిద్ర మత్తులో ఉన్నాడో లేదంటే మరో కారణమో కానీ జాతీయ రహదారిపై కంటైనర్‌ను ఢీకొట్టాడు. కృత్తివెన్ను మండలం సీతనపల్లి దగ్గర ఘటన చోటు చేసుకుంది. క్షతగాత్రులను మచిలీపట్నం ఆస్పత్రికి తరలించారు. మృతులంతా తాళ్లరేవు వాసులుగా గుర్తించడం జరిగింది. మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో కృత్తివెన్ను రోడ్డు ప్రమాద క్షతగాత్రులను మంత్రి కొల్లు రవీంద్ర పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ముందస్తుగా రూ. 5లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. శుక్రవారం తెల్లవారుజామున కంటైనర్, మినీ వ్యాన్ ఢీకొని ఆరుగురు మృతి చెందగా.. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. జిల్లా కలెక్టర్, ఎస్పీ, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావులతో కలిసి జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మంత్రి కొల్లు రవీంద్ర పరామర్శించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు మృతులు ఒకొక్కరికి రూ. 5లక్షలు చొప్పున మొత్తం రూ. 30 లక్షలు ఎక్స్ గ్రేషియా అందిస్తామని కొల్లు రవీంద్ర వెల్లడించారు. ఎక్స్ గ్రేషియా మొత్తాన్ని ఈ రోజు సాయంత్రం లోపు అందజేస్తామని తెలిపారు. రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇటువంటి ప్రమాదాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు.

# తెలుగు పాఠ్యపుస్తకాల్లో ముందుమాట

**• తప్పులపై సర్కార్ దిద్దుబాటు చర్యలు • ఇద్దరు అధికారులపై వేటు వేసిన ప్రభుత్వం**

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** తెలుగు పాఠ్యపుస్తకం ముందు మాటలో తప్పులపై ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ పాఠ్యపుస్తకాల విభాగం డైరెక్టర్ శ్రీనివాసచారి, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రాధారెడ్డిపై చర్యలకు ఆదేశించింది. పాఠ్యపుస్తకాల బాధ్యతల నుంచి శ్రీనివాసచారి, రాధారెడ్డిని తొలగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఎస్సీఈఆర్టీ డైరెక్టర్‌గా పాఠశాల విద్య అదనపు డైరెక్టర్ రమేశ్‌కు బాధ్యతలు అప్పగించారు. టీఆర్ఈఐఎస్ కార్యదర్శి రమణ కుమార్‌కి ముద్రణ సేవల విభాగం డైరెక్టర్‌గా బాధ్యతలు కేటాయించారు. తెలంగాణలో ఒకటి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేసిన తెలుగు వాచకం పాఠ్య పుస్తకాలను వెనక్కి తీసుకోనున్నారు. పంపిణీ చేయని వాటిని పిల్లలకు ఇవ్వకుండా నిలిపివేశారు. 24 లక్షల పుస్తకాల్లోని ముందుమాటలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు, అధికారుల పేర్లను ముద్రించారు. ఏళ్ల క్రితం నాటి ముందుమాటలో మార్పులు చేయకుండా రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎస్సీఈఆర్టీ) అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహించారు. బుధవారం పుస్తకాలను విద్యార్థులకు అందజేస్తున్న సమయంలో ముందుమాటలోని తప్పులను చాలాచోట్ల ఉపాధ్యాయులు గుర్తించి విద్యాశాఖ దృష్టికి తీసుకొచ్చారు. తొలుత ఆ పేజీని చించేయాలని ఆదేశించిన అధికారులు తమ నిర్ణయాన్ని మార్చుకున్నారు. ఆ పేజీని తొలిగిస్తే దాని వెనుకున్న వందేమాతరం, జాతీయ గీతం, ప్రతిజ్ఞ లేకుండా పోతాయి. అప్పుడు మరిన్ని విమర్శలు వస్తాయని భావించారు. దాంతో పిల్లలకిచ్చిన, ఇవ్వని పుస్తకాలన్నీ వెనక్కి తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన డీఈఓలను ఆదేశించారు. వాటిని మండల వనరుల కేంద్రాలకు తరలించాలని సూచించారు. ఆ పేజీ మొత్తం కనిపించకుండా స్టిక్కర్ వేసి అందజేయనున్నారు. తెలుగు వర్క్ బుక్స్‌నూ వెనక్కి తీసుకుంటున్నారు.

## పుస్తకాలను తిరిగి ముద్రించడం లేదు

- ముందుమాట పేజీ మాత్రమే మార్పు
- కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి వివరణ

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** పాఠ్యపుస్తకాల వివాదంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి వివరణ ఇచ్చారు. కేవలం ముందుమాట పేజీ మార్చి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పుస్తకాలను మళ్లీ ముద్రిస్తున్నామనే ప్రచారంలో నిజం లేదన్నారు. దీనివల్ల ప్రభుత్వంపై ఎలాంటి భారం పడదని స్పష్టం చేశారు. విద్యార్థులకు తప్పుడు సమాచారం వెళ్లకూడదనే ఈ రకమైన నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలోని విద్యార్థులకు అందజేసిన పాఠ్యపుస్తకాల్లో ముద్రితమైన మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, కడియం శ్రీహరి పేర్లను తొలగించాలని తాజాగా సర్కారు నిర్ణయించింది. ఈ పేర్లున్న పేజీపై మరో పేజీని అతికించి ఇవ్వాలని ఆదేశాలిచ్చింది. గమ్ స్టిక్కర్లు ఉన్న పేజీని ఆ పేజీపై అతికించనున్నట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. గతంలో ఇలాగే పొరపాటు జరిగినప్పుడు పేజీని అతికించామని, ఇప్పుడు అలాగే చేయనున్నట్టు ఆయా వర్గాల ద్వారా తెలిసింది. రాష్ట్రంలో 1 నుంచి 10వ తరగతుల్లోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేసిన విషయం తెలిసిందే. దాదాపు ఈ పుస్తకాల సంఖ్య 25లక్షల వరకు ఉంటుంది. ఈ పుస్తకాల్లోని ముందుమాటలో కేసీఆర్ సహా మాజీ మంత్రుల పేర్లను ప్రస్తావించారు. ఈ విషయం సోషల్ మీడియాలో రావడంతో ఏదో తప్పు జరిగిందన్నట్టుగా పాఠశాల విద్యాశాఖ ఆగమేఘాల మీద ఆయా పుస్తకాలను వెనక్కి తీసుకోవాలని ఆదేశించింది. అన్ని పాఠ్య పుస్తకాలను వెనక్కి తీసుకోవాలని విద్యాశాఖ మంగళవారం ఉత్తర్వులిచ్చింది. పుస్తకాలను ఎమ్మార్సీలో అందజేయాలని, ఎంఈవోలు వాటిని జిల్లా పుస్తకాల గోడౌన్‌లో వాపస్ చేయాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నది. ఇది అత్యంత ముఖ్యమైన అంశమని ప్రస్తావించింది. కొన్ని ప్రాంతాల్లో ఆయా పేజీని చింపివేయాలని మంగళవారం మౌఖిక ఆదేశాలిచ్చారు. ఇదే పేజీ వెనక వందేమాతరం, జనగణమన లుండటం, వాటిని అవమానం జరుగుతుందన్న అభ్యంతరాలు టీచర్ల నుంచి రావడంతో ఆఖరుకు పేజీని అతికించాలని నిర్ణయించారు.

# నటి హేమ బెయిల్‌పై విడుదల



**బెంళూరు, జూన్ 14:** బెంగళూరు రేవ్ పార్టీ కేసులో అరెస్టయిన తెలుగు సినీనటి హేమ జైలు నుంచి విడుదలయ్యారు. ఇటీవల ఆమెకు స్థానిక కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఆమె నుంచి డ్రగ్స్ ను జప్తు చేసుకోలేదని, ఘటన జరిగిన పది రోజులకు వైద్య పరీక్షలు నిర్వహించారని హేమ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. డ్రగ్స్ తీసుకున్నట్లు పోలీసులు సాక్ష్యాలు అందించలేదని న్యాయస్థానం దృష్టికి తీసుకు వెళ్లారు. ఆమె పార్టీలో పాల్గొన్నట్లు చూపే ఆధారాలను బెంగళూరు నేర నియంత్రణ దళం (సీసీబీ) న్యాయవాది కోర్టుకు అందజేశారు. వాదనలను విన్న న్యాయమూర్తి షరతులతో కూడిన బెయిల్ మంజూరుచేశారు. ఈ క్రమంలో శుక్రవారం హేమ జైలు నుంచి బయటకు వచ్చారు. ఈసందర్భంగా సెక్యూరిటీ పోస్ట్ వద్ద ఉన్న సిబ్బంది ఆమెను కన్నడలో ప్రశ్నించగా, 'బర్త్‌డే పార్టీ' అంటూ సమాధానం ఇచ్చారు. మీడియాతో మాట్లాడకుండా వెళ్తే, వేరేరకంగా ఉంటుందంటూ హేమ పక్కన ఉన్న వ్యక్తి ఆమెకు సూచించారు. అయితే, 'వీళ్లకు చెప్పాల్సిన అవసరం ఏముంది' అనుకుంటూ హేమ అక్కడినుంచి వెళ్లిపోవడం గమనార్హం.

# అదుపుతప్పి కట్టెల లారీ బోల్తా

**కానిస్టేబుల్, టీచర్ దుర్మరణం**

**మహబూబాబాద్, ప్రజానావ:** మహబూబాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం ఉదయం మహబూబాబాద్ నుంచి నర్సంపేట కట్టెల లోడుతో వెళ్తున్న లారీ గూడూరు మండల కేంద్రంలో మూలమలుపు వద్ద టర్న్ అవుతుండగా బోల్తా పడింది. అదే సమయంలో అక్కడే రోడ్డుపై నిలిచి ఉన్న గూడూరు పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ దనసరి పాపారావు, సీఆర్‌టీ టీచర్ చింప దేవేందర్‌పై పడటంతో అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తికి గాయాలు కాగా అతడిని గూడూరు హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. లారీ డ్రైవర్, లారీ క్లీనర్ ఇద్దరు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితు కుటుంబాలకు న్యాయం చేయాలని గిరిజన సంఘాలు వచ్చి రోడ్డుపై పైఠాయించి ధర్నా నిర్వహించారు. సంఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ రామ్ నాద్ కేకన్ పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును స్థానిక పోలీసుల నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోడ్డుపై పడి ఉన్న కట్టెల లారీ క్లియర్ చేయించి, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## టూవీలర్‌ను ఢీకొన్న బస్సు

**ఒకరు మృతి**

**సిరిసిల్ల, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రుద్రంగి గ్రామ శివారులో ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు యువకుల్లో గండి అజయ్(19)అక్కడికక్కడే మృతి చెందాడు. బోయిని సంతోష్ అనే మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని హాస్పిటల్‌కు తరలించారు. మృతదేహాన్ని పోస్టమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అజయ్ మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

## పోలీసులకు చిక్కిన ఆన్‌లైన్ వ్యభిచార ముఠా

**పార్క్ మోటల్‌పై దాడిచేసి పట్టివేత**

**హైదరాబాద్, ప్రజానావ:** హైటెక్ వ్యభిచార ముఠాను పోలీసులు పట్టుకున్నారు. నిందితుడు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ముందుగా కస్టమర్‌లను సంప్రదించడం జరుగుతుంది. అనంతరం కస్టమర్‌ల డేటా బేస్‌ను తయారుచేసి.. వారు కోరుకున్న ప్రదేశంలో మహిళలు వారిని కలుసుకునేలా ఏర్పాటు చేస్తారు. కస్టమర్‌కు అనుకూలంగా ఉన్న లాడ్జ్‌ను బుక్ చేస్తారు. ఓ మహిళ కస్టమర్‌లతో లావాదేవీలు జరుపుతున్నట్టు పోలీసులు గుర్తించారు. అనేక మారు పేర్లతో సదరు మహిళ కస్టమర్లను ఆకర్షిస్తోందని తెలుసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పంజాగుట్ట పీఎస్ పరిధిలోని పార్క్ హోటల్‌లోని ఓ గదిపై దాడి చేసి బాధితురాలితో పాటు నిందితుడు కీర్తితేజను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితులు నివాసముంటున్న వివిధ ప్రదేశాలపై దాడి చేసి, పైన పేర్కొన్న ప్రధాన నిర్వాహకులు.. సబ్-ఆర్గనైజర్లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 89,500 నగదు, రెండు కార్లు, రెండు బైక్స్, 18 సెల్‌ఫోన్లు, రెండు ల్యాప్‌టాప్‌లు, వివిధ బ్యాంకుల డెబిట్/క్రెడిట్ కార్డ్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



# ధరణి, ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

**సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్**

**కరీంనగర్, ప్రజానావ :** జిల్లాల్లో ధరణి, ప్రజావాణి కార్యక్రమాల ద్వారా వచ్చే ఫిర్యాదులు దరఖాస్తులపై సత్వరమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి ఆయన కలెక్టర్లతో పెండింగ్ ధరణి, ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం, భూముల మార్కెట్ విలువలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా నవీన్ మిట్టల్ మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులు, మ్యుటేషన్ల పరిష్కారానికి మ-రోసారి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, అన్ని తహసీల్దార్, రెవెన్యూ డివిజన్ కార్యాలయాల వారీగా ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేయడంతో పాటు ప్రతిరోజు వచ్చే దరఖాస్తులను కలెక్టర్లు సమీక్షించాలని, అధికంగా పెండింగ్ ఉన్న మండలాలకు అవసరమైన అదనపు సిబ్బందిని కేటాయించాలని సూచించారు. సీఎం ఆదేశాల మేరకు రాష్ట్రస్థాయిలో ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే భూసంబంధిత సమస్యలను సైతం కలెక్టర్లకు బదిలీ చేయడం జరుగుతుందని, వీటిని అత్యంత ప్రాధాన్యతతో సత్వర పరిష్కారం జరిగేలా చూడాలని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రిజిస్ట్రేషన్ విలువ పెంపు ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తున్నదని, దీని కోసం జిల్లాలో భూముల మార్కెట్ విలువ, ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువ వివరాలతో కూడిన నివేదికను అందించాలని, మార్కెట్ విలువ నమోదులో ఎక్కడా స్థానికంగా ఎటువంటి వివాదాలు రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సబ్ రిజిస్టర్ కార్యాయాల ఏర్పాటుకు కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్, గంగాధరలలో అనువైన భవనం లేదా భూమి కేటాయించి ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. సీసీఎల్ఏ నుంచి కలెక్టర్లకు రిటర్న్ వచ్చిన దరఖాస్తుల్లో అధికంగా ఆర్ఎస్ఆర్ దరఖాస్తులు, సంబంధిత ఆధారిత డాక్యుమెంట్లు జత చేయని దరఖాస్తులు ఉంటాయని అన్నారు. ఆర్ఎస్ఆర్ దరఖాస్తుల్లో తప్పుడు ఎంట్రీ జరిగిందా? ధ్రువీకరించి, తప్పుడు ఎంట్రీని తొలగించి, ఆర్ఎస్ఆర్ సవరణకు రిపోర్టుతో సహా దరఖాస్తులు పంపాలని కలెక్టర్లకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, జిల్లాలో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం కొరకు ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టి, త్వరగా ఫైళ్లు డిస్పోజ్ చేసేలా చర్యలు చేపడుతామని, ఎప్పటి పనులు అప్పుడే పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటామని చెప్పారు. అవసరమైన మండలాలకు అదనపు సిబ్బందిని కేటాయించి దరఖాస్తులు వేగవంతంగా పరిష్కారం అయ్యేలా చూస్తామని అన్నారు. హుజూరాబాద్, గంగాధరలలో సబ్ రిజిస్టర్ కార్యాలయ ఏర్పాటుకు భవనం లేదా స్థలాన్ని గుర్తిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషన్ కలెక్టర్(రెవెన్యూ) లక్ష్మీకిరణ్, డీఆర్వో పవన్ కుమార్, కరీంనగర్, హుజూరాబాద్ ఆర్డీవోలు మహేశ్వర్, రమేశ్‌బాబు, జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# వార్షిక రుణ ప్రణాళిక.. ₹10182.70 కోట్లు

- ఆర్థిక మద్దతు పథకాల లక్ష్య సాధనకు బ్యాంకర్లు సహకరించాలి..
- ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు రూ.9954.20 కోట్ల రుణాలు మంజూరు
- బ్యాంకర్లు అత్యుత్తమంగా పని చేయాలి
- కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, ప్రజానావ :** 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 10182.70 కోట్ల వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ పమేలా సత్పతి విడుదల చేశారు. శుక్రవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, బ్యాంకర్లతో రైతులకు రుణాల పంపిణీ, స్వయం సహాయక సంఘాలకు రుణాలు, రికవరీ, పీఎం జి.పి.వై. రుణాలు, ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖలతోపాటు పలు పథకాలకు సంబంధించి రుణ లక్ష్య పురోగతిపై డీసీసీ, డీఎల్ ఆర్ సీ సమీక్షా సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా వార్షిక రుణ ప్రణాళికకు సంబంధించిన బుక్ లెట్ ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ అవసరాల కోసం రూ.3673.92 కోట్లు, ఎంఎస్ఎంఈ కింద రూ.2997.06 కోట్లు, విద్యా రుణాలు రూ.44.55 కోట్లు, గృహ రుణాలు రూ.192.00 కోట్లు, ఇతర రంగాలకు గానూ రూ.3275.17 కోట్ల రుణాలను బ్యాంకర్లు అందించాలని ఆదేశించారు. 2023 -24 ఆర్థిక సంవత్సరంలో 9927 స్వయం సహాయ బృందాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ. 64,049.25 లక్షలు అందించాలనేది లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సంవత్సరం మార్చి 31 31 నాటికి 12010 సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు రూ. 77021.92 లక్షల బ్యాంకు లింకేజీ అందించి 120.25 శాతం లక్ష్యాన్ని సాధించామని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే కరీంనగర్ జిల్లా రెండవ స్థానం సాధించిందని వెల్లడించారు. ఇందుకు అధికారులు, బ్యాంకర్లను అభినందిస్తున్నానని పేర్కొన్నారు. ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 నెల వరకు రూ. 9954.20 కోట్ల రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలకు గానూ రూ. 4234.16 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగంలో రూ. 1763.02 కోట్లు, విద్యా రుణాలకు రూ.18.23 కోట్లు, హౌసింగ్ లోన్స్ రూ.299.61 కోట్లు, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ లకు రూ.770.22 కోట్లు, ఇతర రంగాలకు సంబంధించి రూ. 2938.96 కోట్లు రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. అర్హులైన రైతులు అందరికీ రుణాలు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పవన్ కుమార్, ఎల్డిఎం ఆంజనేయులు, జిల్లా వ్యవసాయ అధికారి బీ శ్రీనివాస్, పరిశ్రమల శాఖ జీఎం నవీన్ కుమార్, డీఆర్డిఓ శ్రీధర్, మెప్మా ఇన్చార్జి పీడీ స్వరూపా రాణి, జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగార్జున, ఆర్బిఐ అధికారి పల్లవి, నాబార్డ్ డీడీఎం దిలీప్, ఎస్బిఐ ఏజీఎం వెంకటేష్, చీఫ్ మేనేజర్ రామచంద్రుడు, యుబీఐ ఏజీఎం సురేష్, చీఫ్ మేనేజర్ కలీం, టీజీబీ ఆర్ఎం బాలనాగు, కేడీసీసీబీ సీఈఓ సత్యనారాయణ రావు, చేనేత శాఖ ఏడి చరణ్, అడిషనల్ డిఆర్డిఏ సునీత, అన్ని బ్యాంకుల కంట్రోలర్స్, కోఆర్డినేటర్స్, వివిధ బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

- పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి
- లక్ష్యసాధనలో ఎంత కష్టమైనా భరించాలి
- కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, ప్రజానావ :** ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకొని విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. ధన్గర్‌వాడీ ఉన్నత పాఠశాలలో మ్యూజిక్, డ్రాయింగ్, టైలరింగ్‌తో పాటు వివిధ అంశాల్లో శిక్షణ పొందిన విద్యార్థులతో శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలని సూచించారు. కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే జీవితంలో సాధించలేనిది ఏమీ ఉండదని స్పష్టం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై విద్యార్థులు ప్రత్యేక సారించాలని సూచించారు. నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించే క్రమంలో ఎన్ని కష్టాలు ఎదురైనా వెనుకడుగు వేయవద్దని, ముందుకు సాగాలని సూచించారు. ఒడిదుడుకులను తట్టుకున్నప్పుడే విజయాలను ఈజీగా సాధించవచ్చని పేర్కొన్నారు. కలలకు ఎలాంటి అడ్డంకులు, ఆంక్షలు ఉండవని, వాటిని సాధించుకోవాలనే తపన ప్రతి ఒక్కరిలో ఉండాలన్నారు. ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్యను అభ్యసించినప్పటికీ విద్యాశాఖ అద్వర్యంలో 42 రోజులు ధన్గర్ వాడీ పాఠశాలలో నిర్వహించిన శిక్షణ ద్వారా సంగీతం, చిత్రలేఖనం వంటి అదనపు బోధన తరగతులకు హాజరైన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. ఇంజినీరింగ్ విద్యార్థులు సంగీతం శిక్షణకు వంటి ప్రాధాన్యం ఇవ్వడం చాలా సంతోషం కలిగించిందన్నారు. జీవన ప్రయాణంలో ఎప్పుడూ ఏదో ఒక కొత్త విషయాన్ని గ్రహించాలని, ఎన్ని అడ్డంకులు, ఎదురైనా కలలను నిజం చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు నేర్చుకున్న సంగీతాన్ని వినిపించడంతో పాటు వారు తయారు చేసిన పేపర్ పూలకుండీలు, డ్రాయింగ్స్ మొదలైనవి కలెక్టర్ కు బహూకరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పవన్ కుమార్, కోర్స్ డైరెక్టర్ గొట్టే ప్రమోద, కోర్స్ ఇన్‌చార్జి ఏనుగు ప్రభాకర్ రావు, ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# మావోయిస్టు దంపతుల లొంగుబాటు

**కరీంనగర్, వరంగల్ ఇన్‌చార్జి సీపీ అభిషేక్ మహంతి**

**కరీంనగర్ క్రైం, ప్రజానావ :** మావోయిస్టు దంపతులు లొంగిపోయినట్టు కరీంనగర్, వరంగల్ ఇన్‌చార్జి సీపీ అభిషేక్ మహంతి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, లొంగిపోయిన దంపతుల వివరాలు వెల్లడించారు. ఆయన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సుదంపల్లి గ్రామానికి చెందిన తిక్క సుశ్మిత (28) ఇంటర్మీడియేట్ వరకు చదువుకున్నది. తన తండ్రి అయినా తిక్క సుధాకర్ మావోయిస్టు సానుభూతిపరుడుగా పని చేశాడని, అతన్ని చూసి ఆకర్షితురాలైన సుష్మిత తన చదువు అనంతరం 2016లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా కోమటిపల్లి గ్రామ అటవీ ప్రాంతంలో బడే చొక్కారావు ఏ దామోదర్ సమక్షంలో మావోయిస్టు పార్టీలో చేరింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా పరియా గ్రామానికి చెందిన మడకం దూల ఏ దూల ఐదో తరగతి వరకు చదువుకున్నాడు. అతని అన్నయ్య ఐయేత 2008 సీపీఐ మావోయిస్టు పార్టీలో చేరాడని, అతన్ని చూసి ఆకర్షితుడైన దూల 2015లో ఏరియా కమిటీ మెంబర్ అయిన జోగి ప్రోత్సాహంతో సీపీఐ మావోయిస్టు పార్టీలో చేరాడు. మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్న సమయంలో వీరిద్దరి మధ్య పరిచయం ఏర్పడి, 2020 మార్చి 30న పెండ్లి చేసుకున్నారు. తర్వాత వివిధ హోదాల్లో పలు చోట్ల పని చేశారు. మావోయిస్టు సిద్ధాంతాలపై నమ్మకం కోల్పోయి, తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన పునరావాస పథకం గురించి తెలుసుకుని ఆకర్షితులైన వీరిరువురు శుక్రవారం వరంగల్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిపై రూ.4 లక్షల చొప్పున మనగదు రివార్డ్ ఉండగా, దానిని సీపీ వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాజీపేట ఏసీపీ తిరుమల్, హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ జే సురేష్ పాల్గొన్నారు.

### లొంగిపోండి.. సమాజంలో కలవండి..

మావోయిస్టులు లొంగిపోయి, సమాజంలో కలువాలని సీపీ అభిషేక్ మహంతి కోరారు. సమాజంలో చాలా మార్పులు వచ్చాయని, అభివృద్ధి వైపు నడిచేందుకు ముందుకు రావాలని ఆకాంక్షించారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వ సహాయంతో పాటు సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు.



# ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య

**బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్**

**నేరడిగొండ, ప్రజానావ :** ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య భోధన,భోజనం అందించడం జరుగుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, అన్నారు.బడి బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని రాజురా గ్రామ పాఠశాలలో నిర్వహించిన బడి బాట కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ముందుగా విద్యార్థులకు యూనిఫామ్ లు అందజేసి చాక్లెట్లను పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు అందరూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవాలని అన్నారు. తాను కూడా ఇదే రాజురా పాఠశాలలో చదువుకొని ఈరోజు ఎమ్మెల్యే గా ఎదిగనన్నా రు.అనంతరం అక్కడే నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల భవనాన్ని సందర్శించి పనులను పరిశీలించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే కు ఉపాధ్యాయులు శాలువతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి సజన్, విడిసి చైర్మన్ రవి, తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులు పంపిణీ

**గన్నేరువరం, ప్రజానావ :** బడిబాట కార్యక్రమంలో భాగంగా గన్నేరువరం మండలంలోని కాసింపేట, పారువెళ్ళ గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలో నాయకులు ఏలేటి చంద్రారెడ్డి, చైర్మెన్ యాళ్ళ తార ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు దుస్తులు పంపిణీ చేశారు, ప్రభుత్వ పాఠశాలలో ఉన్నాయి ఉన్నంత విద్య అందుతుందని ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలో చేరాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ



**చింతలమనేపల్లి, ప్రజానావ :** కౌటాల మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా 100 మంది లబ్ధిదారులకు చింతలమానేపల్లి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముభారక్ చెక్కులు సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండ లంలో పోడు భూముల సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం చింతల మానేపల్లి మండల కేంద్రానికి చెందిన విద్యార్థులు నీట్, ఎంబీబీ ఎస్, ఐఐటిలలో సీటు సాధించడంతో వారిని ఎమ్మెల్యే హరీష్ బాబు సత్కరించి అభినందనలు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణలో భాగస్వాములవ్వాలి : ఎమ్మెల్యే హరీష్

**కాగజ్ నగర్ టౌన్ :** మండలం లోని ఆరేగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో బడిబాట కార్యక్రమం లో పాల్గొని పిల్లలకు శుభాకాంక్షలు తెలిపిన సిర్పూర్ ఎమ్మె ల్యే పాల్వాయి హరీష్ బాబు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడీడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని, అందులో నూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవాలని పిలుపునిచ్చారు. ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ పాఠశాలకు ఎన్నటికీ ప్రత్యామ్నాయం కాజాల వని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తా మని తెలిపారు.అనంతరం పిల్లలకు టెక్స్ట్ పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేసి అక్షరాభ్యాసం నిర్వహిం చారు. కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, మానస, ఉపాధ్యాయులు స్వరూప, అనూష, సంధ్య, రమేష్, రాజేష్ ఎంపిటిసి శోభ, సిఏ లావణ్య, మాజీ ఎంపీటీసీ అమన గంటి సాంబయ్య, చాప్లె రాందాస్, భీమన్ కార్ బాబురావు, గణపతి పాల్గొన్నారు.



ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రొ.జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఖైరతాబాద్ నియోజకవర్గం వెంకటేశ్వర డివిజన్ దేవరకొండ బస్తీలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్‌తో పాటు పాఠ్య పుస్తకాలను ఎమ్మెల్యే దానం నాగేందర్ చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యకమంలో కార్పొరేటర్ మన్నె కవిత రెడ్డి, పాఠశాల సిబ్బంది, మామిడి నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

– ఖైరతాబాద్, ప్రజానావ





## ప్రయాణికుల రద్దీయే.. ప్రమాదానికి కారణమా?

### ఆర్టీసీ బస్సు కింద పడి ఇంటర్ విద్యార్థిని దుర్మరణం

**ఖైరతాబాద్, ప్రజానావ:** ఆర్టీసీ బస్సు కింద పడి ఓ ఇంటర్ విద్యార్థిని మృతి చెందిన ఘటన కలకలం సృష్టిస్తున్నది. యూసఫ్‌గూడలో జరిగిన ఈ ఘటన అందరినీ కలిచివేసింది. ప్రమాద ఘటన ప్రకారం ఓ విద్యార్థిని యూసఫ్‌గూడలో ఉన్న మాస్టర్స్ కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నది. రోజూ ఆమె కాలేజీకి ఆర్టీసీ బస్సులో వెళ్తుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం యూసఫ్‌గూడ బస్టాండ్ వద్ద వేచి చూస్తున్నది. ఈ లోగా తన గమ్యస్థానానికి వెళ్లాల్సిన బస్సు రావడంతో ఎక్కేందుకు ప్రయత్నించి జారి పడిపోయింది. బస్సు టైర్లు ఆమెపై వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలి వివరాలు ఇంకా తెలియలేదని, ఘటనపై విచారణ జరుపుతున్నామన్నారు. అయితే ఇలాంటి ఘటనలు ఈ మధ్య కాలంలో చాలా జరిగాయని అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది. ప్రభుత్వ ఉద్దేశం మంచిదే. అయితే పెరిగిన రద్దీని దృష్టిలో పెట్టుకుని దానికి అనుగుణంగా బస్సులు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.



## అంగన్వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం

**చందుర్తి, ప్రజానావ :** రాజన్న సిరిసిల్ల జిల్లా చందర్తి మండలంలోని మల్యాల గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల్లో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు శారీరక, మానసిక మేధావికాసంతో పాటు మెరుగైన ఆంగ్ల విద్యను అందిస్తూ పిల్లల పోషణ స్థాయిని మెరుగుపరచడానికి మంచి పౌష్టికా హారం అందించడం జరుగుతుందన్నారు. చిన్నారులకు అంగన్వాడీ కేంద్రంలో కొత్తగా నమోదు చేసుకుని వారికి అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు జ్యోతి, మంజుల, సంధ్య, అనిత, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లత, వనజ, వివో అధ్యక్షురాలు మంజుల, ప్రతిమ ఫౌండేషన్ శ్రీలత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జీహెచ్ఎంసీ పరిధిని పెంచవద్దు

**ప్రజానావ, ఖైరతాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ జీహెచ్ఎంసీ పరిధిని పెంచే ప్రతిపాదనను బీజేపీ పార్టీ వ్యతిరేకిస్తుందని, తద్వారా రంగారెడ్డి జిల్లా ఉనికి దెబ్బతినే ప్రమాదం పొంచి ఉందని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహ్మారెడ్డి, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు మల్లారెడ్డిల అన్నారు. ఈ మేరకు హిమాయత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడు తూ 21 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్స్ జీహెచ్ఎంసీ విలీనం చేయాలనీ చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపా దనను వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ పరిధిని పెంచాలనే ప్రభుత్వ ప్రతిపాదనను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం ముస్లింల ప్రాబల్యం కొనసాగడానికి జిహెచ్ఎంసిలో మున్సిపాలిటీలను, కార్పొరేషన్లు విలీనం చేయడానికి అధి కారులు పూనుకుంటున్నారని ఆరోపించారు. జీహెచ్ఎంసీ పరిధిని విస్తరిస్తే హైదరాబాద్ చుట్టు ఉన్న గిరి, మేడ్చల్ జిల్లాలో అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. చెరువులు, కుంటలు కబ్జాలకు గురైయ్యే ప్రమాదం ఉందన్నారు. గతంలో జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసేముందు తాము వ్యతిరే కించామని వారు అన్నారు.

ప్రభుత్వం పన్నులు వసూలు చేసేందుకు, మజ్లిస్ను సంతృప్తి పరిచేందుకు ఈ నిర్ణయం తీసుకుందని వారు ఆరోపించారు. ఈ నిర్ణయం రాజకీయ కోణం మాత్రమే అన్నారు. ఈ అశాస్త్రీయమైన నిర్ణయాన్ని ప్రజలు వ్యతిరేకి స్తున్నారని అన్నారు. గతంలో జీహెచ్ఎంసీ ని ఏర్పాటు చేసి హైటెక్ సిటీ లాంటి ప్రాంతాలను మాత్ర మే అభివృద్ధి చేసి హైదరాబాద్ను అభివృద్ధి చేశామని చెప్పారాని విమర్శించారు. జిహెచ్ఎం సీల విలీనం వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పోలీస్ బైక్ నడిపిన మైనర్

- స్వయంగా హెూంగార్డే స్టేషన్‌కు తీసుకురావాలని ఆదేశం
- ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు



**ప్రజానావ, కోనరావుపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలో ఓ మైనర్ బాలుడు వాహనాన్ని నడుపుతుండగా పట్టుకున్న హెూంగార్డు ఆ బైక్‌ను తీసుకొని ఠాణాకు తరలించే క్రమంలో అక్కడే ఉన్న పోలీస్ బైక్‌ను తీసుకురావాలని మైనర్‌ను ఆదేశించాడు. దీంతో స్థానికులు హెూంగార్డు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో ఓ ద్విచక్రవాహనంపై ముగ్గురు వెళ్తున్నారు. ఆ వాహనాన్ని ఓ మైనర్ డ్రైవింగ్ చేస్తుండడంతో హెూంగార్డు వాహనాన్ని ఆపి పక్కన పెట్టించాడు. అయితే పట్టుకున్న వాహనాన్ని స్టేషన్‌కు తరలించే క్రమంలో అదే వాహనాన్ని హెూంగార్డు నడపగా, హెూంగార్డు వచ్చిన పోలీస్ బైక్‌ను మాత్రం మైనర్‌కి ఇచ్చి స్టేషన్ వరకు తీసుకెళ్లాడు. ఈ దృశ్యాన్ని చూసిన గ్రామస్తులు మైనర్ బాలుడు వాహనాన్ని నడిపితే పట్టుకున్న పోలీసులే.. ఎలాంటి డ్రైవింగ్ లైసెన్స్ లేని మైనర్‌కు వాహనాన్ని ఇచ్చి నడపమని చెప్పడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఇంటి నుంచి ఇంకో ఇంటికి వెళ్లడానికి, ఊర్లోకి పని నిమిత్తం వచ్చినా కూడా వాహనాలను పెట్రోలింగ్ చేసే హెూంగార్డు, పోలీసు సిబ్బంది, ఫైన్లు వేస్తామని బెదిరింపులకు గురిచేస్తూ ఇబ్బంది పెడుతున్నారన్నారు. రోడ్డుమీద వెళ్తున్నపుడు, సంబంధిత పత్రాలు లేనప్పుడు ఫైన్ వేస్తే తమకేం ఇబ్బందిలేదని, గ్రామంలో చిన్నచిన్న పనులకు బయటకు వచ్చినప్పుడు కూడా పోలీసులు ఇబ్బంది పెడుతున్నారని వాపోతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని మైనర్‌తో పోలీసు వాహనాన్ని నడిపించిన హెూంగార్డుపై వెంటనే చట్టరీత్య చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## వంతెనను ప్రారంభించండి

- వర్షమొస్తే రాకపోకలకు ఇబ్బంది
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



**చందుర్తి, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మరిపెల్లి – మూడపెల్లి గ్రామాల మధ్య కస్తూర్బా పాఠశాల సమీపంలో నూతనంగా నిర్మించిన వంతెనను వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ అనురాగ్ జయంతికి కరీంనగర్ ఎంపీ స్వతంత్ర అభ్యర్థి గుడిసె మోహన్ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వంతెన నిర్మాణం పూర్తయినా ఇంతవరకు ప్రారంభించలేదని, వర్షాకాలం ప్రారంభం కావడంతో వేములవాడ–కోరుట్ల ప్రధాన రహదారిలో రాకపోకలకు ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతారన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు వంతెన కింద నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని, ఇది వరదలకు దారి తీయవచ్చని పేర్కొన్నారు. బ్రిడ్జి ప్రారంభిస్తే గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులు, ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు.

## ప్రైవేట్ స్కూళ్ల బెడద పోవాలన్నదే ధ్యేయం

### నాలుగు నెలల్లో బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టును ప్రారంభించుకుందాం : మంత్రి కోమటిరెడ్డి



బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టును మంత్రి సందర్శించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**నల్గొండ, ప్రజానావ:** రాబోయే నాలుగున్నరేళ్లలో తెలంగాణను దేశంలోనే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. ప్రైవేట్ స్కూళ్లను మూసివేసి.. ప్రభుత్వ పాఠశాలలన్నీ తెరుచుకోవాలనేది తమ ప్రభుత్వ నినాదమని అన్నారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు పంప్ హౌస్, ప్రాజెక్టు రిజర్వాయర్‌ను పరిశీలించారు. నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణ వెల్లంల గ్రామంలోని అమ్మ ఆదర్శ పాఠశాలలో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మంత్రికి పూర్ణ కుంభంతో అధికార యంత్రాంగం స్వాగతం పలికారు. బ్రాహ్మణ వెల్లంల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్కను నాటి విద్యార్థులతో మంత్రి కోమటిరెడ్డి అక్షరాభ్యాసం చేయించారు. మంత్రితో పాటు ఎమ్మెల్యే వేముల వీరేశం, కలెక్టర్ దాసరి హరిచందన, జిల్లా ఎస్పీ చందనా దీప్తి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చి 10 ఏళ్లయిందని.. అసలైన రాష్ట్రం డిసెంబర్ 3న తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే వచ్చిందని చెప్పారు. విద్యా రంగంపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకమైన దృష్టి సారించిదని అన్నారు. వచ్చే మూడేళ్లలో విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తెస్తామని ఉద్ఘాటించారు. మాజీమంత్రి మల్లారెడ్డి అనురాగ్, గురునానక్ యూనివర్సిటీల పేరుతో దోచుకుంటు న్నారని ఆరోపణలు చేశారు. ఈ పాఠశాలలోనే ఏడోతరగతి వరకు తాను చదివానని... తల్లిదండ్రుల తర్వాత పుట్టిన ఊరు చాలా గొప్పదని అన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవ చ్చని చెప్పారు. విద్యార్థులు పెద్దపెద్ద కలలు కని సాకారం చేసుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. అనంతరం బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టును మంత్రి సందర్శించారు. వచ్చే నాలుగు నెలల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తీసుకొచ్చి ప్రాజెక్ట్‌ను ప్రారంభించుకుందామని తెలిపారు. డిసెంబర్ లోపు ఈ ప్రాజెక్టులో పూర్తిగా నీళ్లు నింపుతామని అన్నారు. ఇక్కడి చెరువు వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయని చెప్పారు. నార్కట్‌పల్లి డిపోకు మరో వారం రోజుల్లో 20 కొత్త బస్సులు రాబోతున్నాయని చెప్పారు. మూడు –నాలుగేళ్లలో మూసీ నదిని సుందరీకరిస్తామని స్పష్టం చేశారు. మాజీ సీఎం కేసీఆర్ ఇప్పుడు ప్రగతి భవన్, ఫామ్ హౌస్‌కు పరిమితమయ్యారని విమర్శించారు. కూలిపోయిన కాళేశ్వరం ప్రాజెక్టు, విద్య గురించి కేసీఆర్ తన పాలనలో ఏనాడూ పట్టించుకోలేదని మండిపడ్డారు. దక్షిణ తెలంగాణను కేసీఆర్ చిన్నచూపు చూశారని.. అందుకు నిదర్శనమే మొన్నటి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.



## పిడుగుపాటుకు గేదే మృతి

**చందుర్తి, ప్రజానావ:** పిడుగుపాటుకు గేదె మృతి చెందిన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం ఎనగల్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన పకిడే రాజయ్య అనే రైతు తన గేదెను తాటి చెట్టు పక్కన కట్టి వేశాడు. దీంతో ఒక్కసారిగా తాటి చెట్టుపై పిడుగు పడటంతో పక్కనే ఉన్న గేదె అక్కడికక్కడే మృతి చెందింది. గేదే విలువ రూ.70 వేలు ఉంటుందని, రైతు రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. బాధిత రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## సినిఫక్కీలో 3 లక్షలు చోరీ

**మహబూబ్ నగర్, ప్రజానావ:** నారాయణపేట జిల్లాలో దొంగల ముఠా రెచ్చిపోయింది. ప్రధాన రహదారి పక్కనే పట్టపగలు కారు అద్దాలు పగలగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. పక్కా స్కెచ్ వేసి చోరీ చేసి చిక్కకుండా చెక్కేశారు. సీసీ టీవీ ఫుటేజీ అసలు గుట్టు బయటపెట్టింది. నారాయణపేట జిల్లా కేంద్రంలోని సెంటర్ చౌక్‌లో పట్టపగలు నిలిపి ఉన్న కారులో మూడు లక్షల రూపాయల చోరీ ఘటన ఒక్కసారిగా కలకలం రేపింది. కోస్గికి చెందిన వెంకటేష్ అనే వ్యక్తి నారాయణపేటలోని %బ్రూుఖూ% అనే ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో ఇంటి లోన్ తీసుకున్నాడు. లోన్ చెల్లింపులో భాగంగా రూ.3లక్షల నగదును %ఎణఖీజ% బ్యాంక్‌లో తీసి చెల్లించాలని భావించాడు. అయితే సదరు బ్యాంక్‌లో తీయడం వీలు కాలేదు. దీంతో మళ్ళీ సెంటర్ చౌక్ లోని బ్యాంక్‌లో మేనేజర్‌తో మాట్లాడేందుకు వెళ్ళాడు. కారులోనే నగదు ఉంచి మేనేజర్‌తో చర్చించేందుకు మొదటి అంతస్తుకు వెళ్ళాడు. అనంతరం వచ్చి చూసేసరికి కారు డ్రైవర్ సీట్ అద్దం పగిలి ఉంది. అందులోని నగదు మాయమైంది. అవాక్కైన వెంకటేష్ స్థానికులను ఆరా తీశాడు. గుర్తు తెలియని వ్యక్తులు కారు చుట్టూ తిరిగిరాని చెప్పారు. దీంతో విషయం పోలీసులకు చెప్పాడు.వెంకటేష్ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు స్థానికులను ఆరా తీశారు. సమీపంలోని ఓ గోల్డ్ షాప్ లో సీసీ కెమెరా ఫుటేజ్ పరిశీలించడంతో చోరీని ధృవీకరించారు పోలీసులు. ఇక మొత్తం ఎపిసోడ్ లో నిందితులు పక్కా స్కెచ్ ప్రకారమే చోరికి పాల్పడ్డారు. ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ఈ చోరి ఘటనలో భాగస్వాములు అయ్యారు. తీసేందుకు వెళ్ళిన బ్యాంక్ నుంచే వెంకటేష్ ను ఈ ము గ్గురు దుండగులు ఫాలో చేశారు. అదును కోసం వెంకటేష్ ఎక్కడికి వెళితే అక్కడికి వెళ్ళారు. చివరకు బ్యాంక్ వద్ద కారు నిలపడంతో కాసేపు రెక్కి నిర్వహించారు. ఎవరికి అనుమానం రాకుండా ముగ్గురులోని ఒక వ్యక్తి డ్రైవర్ డోర్ అద్దం పగులగొట్టి అక్కడి నుంచి జారుకున్నాడు.

## రాజస్థాన్ వ్యాపారి మోసం

**జైపూర్ :** అమెరికాకు చెందిన చెరిష్ అనే మహిళ జైపూర్‌లోని జోహ్రీ బజార్‌లో బంగారు దుకాణం యజమాని నుంచి బంగారు పాలిష్‌తో కూడిన అభరణాలను కొనుగోలు చేసింది. అయితే వాటికి అక్షరాలా 6 కోట్ల రూపాయలు వెచ్చించింది. విదేశీ మహిళను ఆ నగల వ్యాపారి నిట్ట నిలువునా మోసం చేశాడు, నాణ్యమైన బంగారు నగల పేరుతో ఒకటి కాదు రెండు కాదు ఆరు కోట్ల రూపాయల దోపిడికి పాల్పడ్డాడు. అమెరికాలో ఆ మహిళ ఓ ఎగ్జిబిషన్ లో ఆ ఆభరణాలను ప్రదర్శించింది. ఈ క్రమంలో అవి నకిలీవని తేలింది. వాటి విలువ కేవలం 300 మాత్రమే నని తెలిసి షాక్‌కు గురైంది. వెంటనే సదరు మహిళ జైపూర్‌కి వచ్చి షాప్ యజమాని గౌరవ్ సోనీని నిలదీసింది. దుకాణం యాజమాని ఆమె ఆరోపణలను కొట్టిపారేసాడు. దీంతో చెరిష్.. జైపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే యూఎస్ ఎంబసీ అధికారుల నుంచి కూడా సహాయం కోరింది. స్పందించిన అధికారులు ఈ విషయాన్ని పరిశీలించవలసిందిగా జైపూర్ పోలీసులను కోరారు. 2022లో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా గౌరవ్ సోనీతో పరిచయం ఏర్పడిందని.. గత రెండేళ్లుగా ఆభరణాల కోసం 6 కోట్లు చెల్లించినట్లు ఆ మహిళ పోలీసులకు తెలిపింది. ప్రస్తుతం గౌరవ్, అతని తండ్రి రాజేంద్ర సోనీ పరారీలో ఉండగా.. వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# హాట్ కేకుల్లా కల్కి మూవీ టికెట్స్

## ప్రీ సేల్స్‌లో 'ఆర్‌ఆర్‌ఆర్' రికార్డులు బ్రేక్




నాగ్ అశ్విన్–ప్రభాస్‌ల కాంబోలో రానున్న సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ 'కల్కి 2898 ఏడీ' జూన్ 27న విడుదల కానుంది. దీని కోసం సినీ ప్రియులంతా ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన కొన్ని ఆసక్తికర విషయాలు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నాయి. 'కల్కి' రిలీజ్‌కు ముందే రికార్డులను బ్రేక్ చేస్తోంది. తాజాగా ఓవర్సీస్‌లో దీని ప్రీ బుకింగ్స్ ఓపెన్ చేయగా టికెట్స్ హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. ప్రీ సేల్స్ విషయంలో 'ఆర్‌ఆర్‌ఆర్' రికార్డులను బ్రేక్ చేసింది. అమెరికాలో ఇప్పటికే మిలియన్ డాలర్ల ప్రీ సేల్ బిజినెస్ జరిగింది. ప్రీ బుకింగ్స్‌లో అత్యంత వేగంగా మిలియన్ డాలర్ల మార్కును అందుకున్న ఇండియన్ సినిమాగా రికార్డు సృష్టించింది. ఇదే తరహాలో బుకింగ్స్ కొనసాగితే విడుదలకు ముందే రెండు మిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఆస్ట్రేలియాలో ఇప్పటి వరకు 9 లొకేషన్లలో ప్రీ బుకింగ్స్ ఓపెన్ చేయగా అక్కడ కూడా టికెట్స్ భారీగా అమ్ముడవుతున్నాయి. విదేశాల్లో ఎక్కువ ఐమ్యాక్స్‌ల్లో విడుదల కానున్న చిత్రంగా కల్కి మరో రికార్డును సొంతం చేసుకుంది. జూన్ 26న ఈ చిత్రం అక్కడ రిలీజ్ కానుంది. ఏకంగా 90 కంటే ఎక్కువ ఐమ్యాక్స్‌ల్లో దీన్ని ప్రదర్శించనున్నారు. ఇప్పటి వరకు ఏ భారతీయ చిత్రం ఇన్ని ఐమ్యాక్స్ థియేటర్లలో విడుదల కాలేదు. రిలీజ్‌కు ఇంకా సమయం ఉండడంతో ఈ సంఖ్యను మరింత పెంచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో ఒక్క పాటే ఉంటుందని ఇటీవల కొన్ని వార్తలు వచ్చాయి. తాజాగా మరో పాటను జోడిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. సినిమా విడుదలకు ముందే ఆ పాటను రిలీజ్ చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల అమితాబ్ కూడా తన బ్లాగ్‌లో పోస్ట్ పెడుతూ.. 'త్వరలో విడుదల కానున్న సినిమాలోని పాట చిత్రీకరణలో బిజీగా ఉన్నాను' అని తెలిపారు. దీంతో అది 'కల్కి'లోని పాటే అని కొందరు భావిస్తున్నారు. ఈ పాటను ప్రముఖ బాలీవుడ్ సింగర్ అర్జిత్ సింగ్ పాడినట్లు తెలుస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం తెరకెక్కింది. తాజాగా దీని ప్రచారం జోరు పెంచారు. వినూత్న రీతిలో ప్రమోషన్ మొదలు పెట్టారు. 'కల్కి' అని పేరు రాసున్న ప్రచార వాహనాలు రోడ్లపై కనిపిస్తున్నాయి. గతంలోనూ ఫ్యాన్స్ కార్ ర్యాలీ నిర్వహించిన సంగతి తెలిసిందే. కార్లను 'ప్రాజెక్ట్– కె' (కల్కి వర్కింగ్ టైటిల్) లోగో రూపంలో పార్క్ చేసి ఇదే పేరుతో ఉన్న ప్రత్యేక టీ షర్ట్ ధరించి సందడి చేశారు. జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను అమరావతిలో ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. భారీగా దీన్ని నిర్వహించనున్నట్లు టాక్. సినీ, రాజకీయ ప్రముఖులను అతిథులుగా ఆహ్వానించాలని చిత్రబృందం భావిస్తుంది. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రానుందని కొన్ని పోస్ట్‌లు సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ప్రభాస్ సరసన దీపిక పదుకొణె నటిస్తుండగా.. సీనియర్ హీరో కమల్ హాసన్ విలన్ పాత్ర పోషిస్తున్నారు. అలాగే అమితాబ్ బచ్చన్ అశ్వత్థామగా నటించారు. పశుపతి, రాజేంద్రప్రసాద్, దిశా పటానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# చిరు విశ్వంభరలో బాలీవుడ్ స్టార్ కునాల్ కపూర్




అగ్ర కథానాయకుడు చిరంజీవి ప్రధానపాత్రలో వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'విశ్వంభర' తాజాగా మరో కొత్త సమాచారంతో అభిమానుల్లో జోష్ పెంచింది. ఇందులో ఓ బాలీవుడ్ నటుడు పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నట్లు తెలిపింది. బాలీవుడ్ నటుడు కునాల్ కపూర్ 'విశ్వంభర' టీమ్‌లో జాయిన్ అయినట్లు తెలుపుతూ దర్శకుడు పోస్ట్ పెట్టారు. ఇందులో కునాల్ విలన్‌గా కనిపించనున్నారంటూ కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ హీరోపై పోస్ట్ పెట్టిన నిర్మాణ సంస్థ.. ఆయన ఏ పాత్రలో కనిపించనున్నారనే విషయాన్ని మాత్రం గోప్యంగా ఉంచింది. ఇందులో కునాల్ పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని.. ఆయన విలన్ అని తెలిసే ట్విస్ట్ సినిమాకే హైలైట్ అని టాక్. ఇప్పటికే ఈ బీటౌన్ హీరోపై కొన్ని కీలకమైన సన్నివేశాలను కూడా చిత్రీకరించినట్లు సమాచారం. ప్రస్తుతం 'విశ్వంభర' షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో కునాల్ కూడా పాల్గొంటున్నారు. జులై చివరి నాటికి చిత్రీకరణ పూర్తి చేయాలనే లక్ష్యంతో శరవేగంగా షూట్ చేస్తున్నారు. ఈ సినిమాలో విజువల్ ఎఫెక్ట్స్‌కు ప్రాధాన్యం ఉన్న నేపథ్యంలో పోస్ట్ ప్రొడక్షన్‌పై చిత్రబృందం ప్రత్యేక దృష్టి పెట్టనుంది. రూ.200కోట్లతో సోషియో ఫాంటసీ ఫిల్మ్‌గా 'విశ్వంభర' రూపొందుతోంది. ఇప్పటి వరకు చూడని పాత్రలో చిరు కనిపించనున్నారు. భారీ స్థాయిలో యాక్షన్ సీక్వెన్స్‌లు ఉండనున్నాయి. ఇక ఈ చిత్రంలో ఐదుగురు హీరోయిన్లు ఉండనున్నట్లు ఎప్పటి నుంచో టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌లో స్టార్ హీరోయిన్స్ త్రిష, ఆషికా అధికారికంగా జాయిన్ అయ్యారు. సురభి, ఇషా చావ్లా, మీనాక్షి చౌదరి పేర్లను త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 10న ఇది ప్రేక్షకుల ముందుకు రానుంది.

# కొత్తదనం లేని కథ.. కథనంలో బోర్ కాపీ సినిమాలో హరోం హర మూవీ



సుబ్రహ్మణ్యం (సుధీర్ బాబు) ఒక పోలీటెక్నిక్ కాలేజ్ లో ల్యాబ్ అసిస్టెంట్ గా పని చేస్తూ ఉంటాడు. కుప్పం వూర్లో తమ్మిరెడ్డి (లక్కీ లక్ష్మణ్), అతని సోదరుడు (రవి కాలే), ఇంకా శరత్ (అర్జున్ గౌడ) తమ బలగంతో ప్రజల భూములు కాజేసి, తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ వుంటారు. అడ్డువచ్చిన వాళ్ళని నరుకుతూ తమకి ఎదురులేదు అనే విధంగా వుంటారు. ఒకరోజు తమ్మిరెడ్డి మనుషులు ఒక యువకుడిని వెంటాడుతూ చంపడానికి ప్రయత్నం చేస్తూ ఉంటే సుబ్రహ్మణ్యం అడ్డుపడతాడు, తన వుద్యోగం పోగొట్టుకుంటాడు. అదే కాలేజ్ లో పని చేస్తున్న టీచర్ (మాళవిక శర్మ) తో ప్రేమలో ఉంటాడు సుబ్రహ్మణ్యం. తన తండ్రి చేసిన అప్పులు తీర్చటం కోసం డబ్బులు గడించాలని, సస్పెండ్ అయిన పోలీసు కానిస్టేబుల్ పళని (సునీల్) తో చేతులు కలిపి ఖాళీగా వున్న ఒక సినిమా థియేటర్‌లో గన్స్ తయారు చేసి అవి దొంగచాటుగా అమ్మడం మొదలుపెడతాడు. తన తండ్రిని తమ్మిరెడ్డి మనుషులు కట్టి తీసుకువచ్చి చంపటానికి ప్రయత్నం చేస్తుంటే, సుబ్రహ్మణ్యం వాళ్ళని అడ్డుకుంటాడు, తండ్రిని కాపాడుకుంటాడు. సుబ్రహ్మణ్యం పేరు కుప్పంలో మారుమోగుతోంది, ప్రజలు అతన్ని దేవుడిగా చూస్తూ వుంటారు. రెడ్డి మనుషులు ఎందుకు తన తండ్రిని చంపాలని అనుకుంటారు? దొంగతనంగా గన్స్ ఎక్కడ నుండి తయారవుతున్నాయో తెలుసుకోవడానికి వచ్చిన స్పెషల్ పోలీసు ఆఫీసరు (అక్షర గౌడ) ఏమి కనుక్కుంది? రెడ్డి సోదరులకు, సుధీర్ బాబుకి మధ్య యుద్ధం ఎలా, ఎప్పుడు మొదలయిందనేదే 'హరోం హర' సినిమా స్టోరీ. దర్శకుడు జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో వచ్చిన ఈ 'హరోం హర' అల్లు అర్జున్ నటించిన 'పుష్ప' సినిమాకి దగ్గరగా ఉంటుంది. అందులో గంధం చెక్కల దొంగతనంగా అమ్ముతూ, డబ్బులు గడిస్తూ పుష్ప పెద్దవాడైతే, ఇందులో గన్స్ తయారు చేస్తూ వాటిని దొంగతనంగా అమ్ముతూ పెద్దవాడవుతాడు సుబ్రహ్మణ్యం. ఆ సినిమా కూడా చిత్తూరు, తిరుపతి నేపథ్యం అయితే, ఈ సినిమా చిత్తూరు జిల్లాలో కుప్పం నేపథ్యంలో వచ్చిన సినిమా. దానికితోడు గన్స్ తయారుచేస్తూ, దొంగతనంగా అమ్ముతూ, అడ్డువచ్చిన విలన్స్ చంపుకుంటూ పోయే సుబ్రమణ్యాన్ని దేవుడుగా చిత్రీకరిస్తాడు దర్శకుడు. అలాగే సుబ్రహ్మణ్యం తను కాబోయే భార్యకి గన్స్ అమ్మి డబ్బు గడిస్తున్నాను అంటే అది ఆమె సమర్థించటమే కాకుండా, అది చాల మంచిది అన్నట్టుగా చెప్పించాడు దర్శకుడు. 'కేజీఎఫ్' సినిమా కూడా దర్శకుడిపై బాగా ప్రభావం చూపించినట్టుంది, అందుకని ఆ సినిమా ఛాయలు కూడా ఈ 'హరోం హర' లో కనిపిస్తాయి. 'హరోం హర' సినిమా మొదలవడం ఆసక్తికరంగానే సాగుతుంది, కానీ తరువాత కొన్ని సాగదీత సన్నివేశాలతో నింపేసాడు దర్శకుడు. విలన్ మనుషులతో సుధీర్ బాబు తలపడే సన్నివేశం నుండి కథ కొంచెం వేగం పుంజుకుంటుంది. అయితే దర్శకుడు మొదటి సగం వరకు సినిమాని బాగానే చూపించగలిగాడు. కానీ రెండో సగంలో కథ ఏమి చెయ్యాలో తెలియక, ఎక్కువగా పోరాట సన్నివేశాలపై దృష్టి మరల్చాడు.

# పుష్ప-2 షూటింగ్‌లో తగ్గిన వేగం

## విడుదల ఆలస్యం తప్పదన్న టాక్

ఐకాన్ స్టార్ గా అభిమానులు పిలుచుకునే అల్లు అర్జున్ 'పుష్ప 2' చిత్రీకరణలో బిజీగా వున్నారు. దర్శకుడు సుకుమార్ కూడా చిత్రాన్ని త్వరగా పూర్తి చేసే పనిలో ఉన్నారు. అయితే 'పుష్ప 2' సినిమా ఆగస్టు 15న విడుదలవుతుంది అని ఇప్పటివరకు ఘంటాపథంగా చెప్తూకువస్తున్న చిత్ర నిర్వాహకులు ఇప్పుడు ఆ సినిమా ఆ తేదీకి రావటం లేదని అంటున్నట్టుగా పరిశ్రమలో ఒక టాక్ నడుస్తోంది. ఇంకా చిత్రీకరణ చెయ్యాల్సిన సన్నివేశాలు చాలా ఉన్నాయని, అవి కాకుండా పోస్ట్ ప్రొడక్షన్ పని కోసం సుకుమార్ చాలా సమయం అడిగారని కూడా తెలుస్తోంది. అయితే చిత్ర నిర్మాతలు సుకుమార్ పై చాలా ఒత్తిడి తెచ్చి ఎలా అయినా ఆగస్ట్ 15న విడుదల చేయించాలని విశ్వ ప్రయత్నాలు చేసినట్టుగా కూడా తెలుస్తోంది. అయితే ఒత్తిడితో పని చెయ్యడం చాలా కష్టమని, తనకి తగినంత సమయం ఇవ్వాలని, అందుకని ఆగస్టు 15వ తేదీకి సినిమా రావటం కూడా కష్టమని దర్శకుడు నిర్మాతలతో చెప్పినట్టుగా వార్తలు పరిశ్రమలో నడుస్తున్నాయి. ఇప్పుడు చిత్ర నిర్మాతలు కొత్త తేదీ కోసం వెతుకులాట ప్రారంభించారని కూడా తెలిసింది. అయితే దగ్గరలో వాళ్ళకి ఎటువంటి తేదీలు కనపడలేదని, ఎందుకంటే వేరే పెద్ద సినిమాలు ఆ సమయంలో విడుదలకు ఉన్నాయని, అందువలన ఏకంగా డిసెంబర్ నెలలో విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేసుకుంటున్నటుగా తెలిసింది. ఒకవేళ 'పుష్ప 2' డిసెంబర్ నెలలో విడుదలైతే ప్రేక్షకుల్లో ఆసక్తి ఉంటుందా అని కూడా చిత్ర నిర్వాహకులు ఆలోచిస్తున్నట్టుగా తెలుస్తోంది. ఏమైనా కూడా 'పుష్ప 2' విడుదల వాయిదా పడటం మాత్రం ఖాయం అని పరిశ్రమలో అంటున్నారు. అందువలనే ఎన్టీఆర్, శివ కొరటాల కాంబినేషన్ లో వస్తున్న 'దేవర' విడుదల ముందుకు జరిపినట్టుగా తెలుస్తోంది. ఈ సినిమాని మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్నారు, రష్మిక మందన్న ఇందులో కథానాయికగా నటిస్తోంది.



# రాష్ట్రంలో ముమ్మరంగా వ్యవసాయ పనులు



## పలుచోట్ల ఇప్పటికే దుక్కులు దున్నిన రైతులు

## మరిన్ని వర్షాలు పడితే జోరుగా నాట్లకు అవకాశం



**నిజామాబాద్, ప్రజానావ:** ప్రస్తుత వాతావరణం చూస్తుంటే ఇంకా ఎండాకాలం కొనసాగుతున్నట్లుగా ఉంది. అడపాదడపా వర్షాలు పడుతున్నా పూర్తిస్థాయిలో వర్షాలు ఇంకా ప్రారంభం కాలేదు. తొలకరి సకాలంలో వచ్చినా విస్తృతంగా వర్షాలు పడడంలేదు. దీంతో ఇప్పటికే దుక్కులు దున్ని విత్తనాలు వేసేందుకు రైతులు సిద్దంగా ఉన్నారు. కొన్నిచోట్ల పత్తి నాటుకున్నారు. తొలకరి వర్షాలతో విత్తనాలు మొలకెత్తాల్సిన సమయమిది. మృగశిర కార్తె ప్రారంభంలోనే వర్షాలు కురియడం ఆనవాయితీ. అప్పుడే విత్తనాలు వేస్తారు. దుక్కులు దున్ని చాలా మంది రైతులు విత్తనాలు నాటుకునేందుకు సమాయత్తం అవుతున్నా తరుణంలో వర్షాలు మరింతగా పడాలని చూస్తున్నారు. కాల్వలు, ప్రాజెక్టుల్లోకి అప్పుడే నీరు చేరడం లేదు. చాలాచోట్ల ఎక్కువ మంది రైతులు వాణిజ్య పంట అయిన పత్తి పంటనే సాగు చేస్తారు. వర్షాకాలం ప్రారంభంలోనే రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి ఖరీఫ్‌కు సిద్ధమయ్యారు. రైతులకు సాగునీరు, పెట్టుబడి పథకం,బీమా పథకం అమలు చేయడం, పండిన ధాన్యం కొనుగోలు చేయడం వంటి పథకాలు పక్కాగా అమలయితే దేశంలో కరువు కాటకాలు ఉండవంటున్నారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడరని అన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో రైతు సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించుకుని, అమలు చేసుకుంటున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పేర్కొన్నారు. ఎన్నో ఇబ్బందులను అధిగమించి ముందుకు సాగుతుంటే బిఆర్ఎస్ వాళ్లు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో మాదిరిగా రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా విత్తనాలు, ఎరువులు ముందుగానే స్టాక్ పెట్టుకుంటున్నామని పేర్కొన్నారు. పండిన పంటకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తున్నమని పేర్కొన్నారు. నైరుతి రుతుపవనాలు రాష్టాన్ని జూన్ మొదటి వారంలోనే తాకాయి. ఈ సారి రుతుపవనాలు త్వరగానే వచ్చాయి. ఈసారి జూన్ నుంచి సెప్టెంబర్ వరకు వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే చాన్స్ ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. జూన్‌లో నెలలో మాత్రం సాధారణ వర్షపాతమే నమోదు కానుందని తెలిపింది. వాతావరణంలో వచ్చిన మార్పుల నేపథ్యంలో రాష్ట్రంలో ఉష్టోగ్రలకు కాస్త తగ్గాయి. రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాల రాకతో పలు జిల్లాల్లో వానలు పడ్డాయి. ఉరుములు, మెరుపుతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి.

# వయనాడ్‌ను వదులుకోనున్న రాహుల్?

•ప్రియాంకను బరిలోకి దింపేలా ప్లాన్ •కసరత్తు చేస్తున్న కాంగ్రెస్ నేతలు



**న్యూఢిల్లీ, జూన్ 14:** మొన్నటి సార్వత్రిక ఎన్నికల ఫలితాల తరవాత కాంగ్రెస్‌లో మరోమారు ఆశలు చిగురిస్తున్నాయి. కొంచెం కష్టపడితే మోడీని గద్దె దించవచ్చన్న ధీమాలో ఉన్నారు. ఇప్పుడున్న ఎన్‌డిఎ పక్షాలను లాగితే ప్రభుత్వం తమే అన్న ఆలోచనలో కాంగ్రెస్ అగ్రనేతలు ఉన్నారు. మరోవైపు ప్రియాంకను ప్రత్యక్ష రాజకీయాల్లోకి తీసుకని వచ్చే ప్రయత్నాలు దాదాపుగా ఖరారు అయ్యాయి. రాహుల గాంధీ వయనాడ్‌కు రాజీనామా చేస్తే అక్కడ ప్రియాంకను నిలబెట్టేందుకు కసరత్తు జరుగుతున్నట్లు సమచారం. వయనాడ్ ఎంపీ రాహుల్ గాంధీ ఈ స్థానానికి రాజీనామా చేయనున్నారని, ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఇదే హాట్ టాపిక్‌గా మారింది. కేరళలోని వయనాడ్ నుంచి ఎంపీగా ఎన్నికైన రాహుల్ గాంధీ.. ఆ స్థానానికి ఇవాళో, రేపో రాజీనామా చేస్తారనే ప్రచారం నడుస్తోంది. దీనిపై రాహుల్ గాంధీ త్వరలోనే తన నిర్ణయాన్ని ప్రకటించనున్నట్లు కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నాయి. టీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ గాంధీ రెండు చోట్ల నుంచి పోటీ చేశారు. కేరళలోని వయనాడ్, ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలీ రెండు లోక్‌సభ నియోజకవర్గాల్లోనూ రాహుల్ ఎంపీగా పోటీ చేశారు. ఈ రెండు చోట్లా రాహుల్ భారీ మెజార్టీతో గెలుపొందారు. అయితే, నిబంధన ప్రకారం.. ఎన్నికల ఫలితాలు విడుదలైన రెండు వారాల్లో ఏదో ఒక స్థానానికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. దీంతో రాహుల్ గాంధీ వయనాడ్ లోక్‌సభ స్థానానికి రాజీనామా చేస్తారని తెలుస్తోంది. ఇటీవల వయనాడ్ నియోజకవర్గంలో పర్యటించారు రాహుల్.. వయనాడ్, రాయబరేలీ నియోజక వర్గ ప్రజలకు సంతోషంగా ఉండే నిర్ణయం తీసుకుంటానని ప్రకటించారు. మరి రాహుల్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. రాహుల్ గాంధీ వయనాడ్ పార్లమెంట్ స్థానానికి రాజీనామా చేస్తే ఆ చోటు నుంచి ఎవరు పోటీ చేస్తారనే చర్చ కూడా అప్పుడే ప్రారంభమైంది. వయనాడ్ నియోజకవర్గానికి రాహుల్ రిజైన్ చేస్తే.. అక్కడి నుంచి ప్రియాంక గాంధీ పోటీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. లేదంటే కేరళకు చెందిన సీనియర్ నేతను అక్కడి నుంచి పోటీకి దించే అవకాశం కూడా ఉందంటున్నారు. కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడాలంటే యూపీలో కాంగ్రెస్ పుంజుకోవడం అనివార్యం. అందుకే.. రాహుల్ గాంధీ రాయబరేలీ స్థానంలోనే కొనసాగాలని యూపీ కాంగ్రెస్ నేతలు పట్టుబడుతున్నారు. దీంతో రాహుల్ సైతం రాయబరేలీ వైపే మొగ్గు చూపుతున్నారు. దీనిపై ఒకటి రెండు రోజుల్లోనే నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. ఈ క్రమంలో తాజాగా ప్రియాంకా వయనాడ్ నుంచి బరిలోకి దిగుతారని ప్రచారం జరుగుతున్నది. రాహుల్ తన సోదరి కోసం వయనాడ్ స్థానానికి రాజీనామా చేయనున్నారని, దీంతో అక్కడ జరిగే ఉపఎన్నికలో ప్రియాంక పోటీచేస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. 2019లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన ప్రియాంక.. అప్పుడు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వారణాసి నుంచి ప్రధాని మోదీపై పోటీచేస్తారని ప్రచారం జరిగింది. అమెకు కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ ఇవ్వకపోవడంతో అదంతా ఒట్టి ప్రచారమేనని తేలిపోయింది. తర్వాత 2022లో జరిగిన ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచార బాధ్యతలను తన భుజాలపై వేసుకున్నారు. విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. తానే ముఖ్యమంత్రి అభ్యర్థినంటూ పేర్కొన్నారు కూడా. కానీ, తర్వాత ఆ మాటలను వెనక్కి తీసుకున్న ఆమె.. ఎన్నికల్లో పోటీచేయడం లేదని ప్రకటించారు. ఇక తాజాగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో తన తల్లి సోనియా గాంధీ ఇన్నాళ్లు ప్రాతినిధ్యం వహించిన రాయ్‌బరేలి నుంచి పోటీచేస్తారని అంతా అనుకున్నారు. కానీ అక్కడ రాహుల్ పోటీచేసి విజయం సాధించారు.

అయితే కేరళలో అసెం బ్లీ ఎన్నికల నేపథ్యంలో రాహుల్.. వయనా డ్‌ను అట్టిపెట్టుకుని రాయ్‌బరేలి స్థానానికి రాజీనామా చేస్తారనే ప్రచారమూ జరిగింది. అయితే ఇప్పుడు వయనాడ్‌పూ ఆయన వదిలిపెడతారని చర్చ జరుగుతున్నది. దీంతో ఇక్కడ ప్రియాంకను నిలబెట్టి దక్షిణాదిలో మరింతగా ప్రచారం చేయాలని చూస్తున్నారు.



### ఇళ్ల నమూనాలను పరిశీలిస్తున్న ప్రభుత్వం

ఇచ్చిన హామీని నెరవేర్చుకుంటాం : మంత్రి పొంగులేటి

# ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూపు

**ఖమ్మం, ప్రజానావ :** తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రకటించినా, ఎన్‌ఇనకల కారణంగా ఇంకా పట్టాలకు ఎక్కించలేదు. దీంతో ఇప్పుడు ప్రజలు తమకు ఇల్లు ఎప్ఉడు వస్తాయని ఎదురుచూస్తున్నారు. పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు ప్రభుత్వం కూడా కసరత్తు ప్రారంభించింది. ఇన్నాళ్లూ ఎన్నికల కోడ్ కారణంగా ముందు కదలని ప్రక్రియను ఇప్పుడు వేగవంతం చేసి ప్రజలకు ఇచ్చిన హామిని ఇలబెట్టుకోవాలని చూస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో పేదలకు ఇల్లు ఒకటి. ఇప్పటికే ప్రజాపాలన పేరుతో అర్హుల నుంచి అప్లికేషన్లు తీసుకున్నారు. అయితే ఇచ్చిన హామిని అమలు చేస్తామని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పదేపదే హామి ఇస్తున్నారు. కొత్త రేషన్ కార్డులు కూడా ఇస్తామని అంటున్నారు. ఇందిరమ్మ ఇళ్లు కావాలని అభ్యర్థిస్తూ 83 లక్షల మంది దరఖాస్తులు చేసుకున్నారు. వాటిని ఇప్పటి వరకు స్క్రూట్నీ చేయలేదు. ఇప్పుడు వాటిని వడపోసి అసలైన లబ్దిదారుల జాబితాను సిద్ధం చేయాల్సి ఉంది. ఓవైపు ఈ పక్రియ సాగుతుండగానే మరో వైపు అసలు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఎలా ఉండాలనే అంశంపై అధ్యయనం ప్రారంబిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు డబుల్ బెడ్రూమ్ పేరుతో ఇళ్లు నిర్మించి ఇచ్చారు. ఇప్పుడు వాటి స్థానంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. తాత్కాలిక బడ్జెట్‌లో కూడా దీనికి ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఈ పథకం కోసం రూ. 7740కోట్లు కేటాయించారు. అంతే కాకుండా ఈ పథకాన్ని కూడా సీఎం రేవంత్ రెడ్డి ఖమ్మంలో ప్రారంభించారు. ఈ పథకానికి హడ్కో వెయ్యికోట్ల రుణాన్ని కూడా మంజూరు చేసింది. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు ముందుక సాగలేదు. ఇప్పుడు వాటిని త్వరగా పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వం నిర్మిస్తున్న ఇళ్ల నమూనాలు పరిశీలించనున్నారు. ఆయా రాష్టాల్లో లబ్దిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణం, వాటి కోసం చెల్లిస్తున్న నిధులు అన్నింటిపై అధ్యయనం చేసి ఓ సరికొత్త మోడల్‌ను తయారు చేయనున్నారు. దాని ప్రకారం పథకాన్ని పూర్తి చేయాలని కాంగ్రెస్ సర్కారు భావిస్తోంది. దీని కోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. ఏడాదికి నాలుగున్నర లక్షల ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన. దానికి తగ్గట్టుగానే నిధులు కేటాయిస్తోంది. ఐదేళ్లలో ఇరవై లక్షలకుపైగా ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నది ప్లాన్. ఒక్కో నియోజకవర్గానికి ఒక ఏడాదిలో 3500 ఇళ్లు నిర్మించనున్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే లాటరీ ద్వారా లబ్దిదారులను ఎంపిక చేస్తే వివాదాలు లేకుండా పక్రియ పూర్తి చేయవచ్చనే లోచన ప్రభుత్వం ఉంది. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను స్క్రూట్నీ చేసి లబ్దిదారులను ఎంపిక, ఇటు ఇళ్లపై అధ్యయనం అన్నీ మూడు నెలల్లో పూర్తి చేసి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని నిశ్చయించింది. మంత్రి పొంగులేటి ఇచ్చిన హామి మేరకు జాగా ఉంటే 5 లక్షలు, లేనివారికి ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు.

# గ్రామాల్లో రాజకీయ సందడి

### ప్రజలకు కృతజ్ఞతలు చెప్పే పనిలో నేతలు

**హైదరాబాద్/అమరావతి, ప్రజానావ :** సార్వత్రిక ఎన్నికల ఘట్టం ముగియడంతో ఇరు తెలుగు రాష్టాల్లో మళ్లీ రాజకీయ సందడి మొదలయ్యింది. వచ్చేది స్థానిక ఎన్నికల కాలం కావడంతో ఛోటామోటా నేతలు ఇప్పటికే హడావిడి చేస్తున్నారు. ఎపిలో కొత్తగా ఎంపికయిన ఎమ్మెల్యేలు కూడా గ్రామాల బాట పడుతున్నారు. ప్రజలను కలిసి కృతజ్ఞతలు తెలియచేస్తున్నారు. దీంతో తెలంగాణతో పాటు ఎపిలోనూ రాజకీయ సందడి మొదలయ్యింది. ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో రాజకీయ పార్టీల సందడి జోరుగా కనిపించింది. అయితే అది ప్రచారమే కావడం వల్ల ఇప్పుడు అసలుసిసలుగా రాజకీయం ఉండబోతున్నది. ఇచ్చిన హామిల మేరకు ప్రజలు కూడా నిలదీసే పరిస్థితి కనిపిస్తోంది. తెలంగాణలో బిజెపి, కాంగ్రెస్, ఎంపిలు, ఎమ్మెల్యేలు ప్రజలకు దన్యవాద కార్యక్రమాలల్లో ఉన్నారు. జిల్లాల్లో ప్రజాక్షేత్రంలోకి వెళ్లి బలోపేతం కావడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. ఒక్కో పార్టీ ఒక్కో పేరిట ప్రజల్లోకి వెళ్లి తమ వాణిని వినిపిస్తున్నాయి. తెలంగాణ మొత్తం అభివృద్ధి చెందిందన్న ప్రచారంతో ప్రజలను బురిడీ కొట్టించిన బిఆర్ఎస్ నేతలు గ్రామాల్లో తలెత్తుకునే పరిస్థితి లేదు. ఎమ్మెల్యేలు జనంలో ఉండాలన్న అధికార పక్షం ఆదేశాన్ని తూచా తప్పకుండా పాటిస్తున్నారు. తమ ప్రభుత్వాల పాలన, పార్టీ కార్యక్రమాలు, లక్ష్యాలు, పనితీరును వివరించడానికి నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాలనపై వివరిస్తూ బీజేపీ నేతలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నారు. గెలిచిన వారు ఎపిలో ప్రజలను నేరుగా కలుసుకునేలా కార్యక్రమాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. తెలంగాణలో బిజెపి, కాంగ్రెస్ ఎంపిలు ప్రజలను కలిసి కృతజ్ఞతలు తెలియ చేస్తున్నారు.




# ప్రపంచ కప్ నుంచి పాకిస్థాన్ ఔట్

## అమెరికా- ఐర్లాండ్ మ్యాచ్ రద్దు



**ఫ్లోరిడా :** టీ20 ప్రపంచకప్ 2024లో దాయాది పాకిస్థాన్ జట్టు పోరాటం ముగిసింది. శుక్రవారం(జూన్ 14) ఆతిథ్య జట్టు అమెరికా, ఐర్లాండ్ మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దవడంతో పాక్ టోర్నీ నుంచి నిష్క్రమించక తప్పలేదు. లీగ్ దశలో సంచలన ప్రదర్శనతో ఆకట్టుకున్న అమెరికా జట్టు తొలిసారి సూపర్ -8కు అర్హత సాధించింది. గత నాలుగైదు రోజులుగా భారీ వర్షాలు కురవడంతో అమెరికా, ఐర్లాండ్ మ్యాచ్ జరగాల్సిన సెంట్రల్ బ్రోవార్డ్ స్టేడియం(ఫ్లోరిడా) మైదానం చిత్తడిగా తయారయ్యింది. వర్షపు నీరు ఎక్కువ సేపు నిల్వ ఉండటం వల్ల అవుట్‌ఫీల్డ్ బాగా దెబ్బతింది. సిబ్బంది చిత్తడిగా ఉన్న ప్రదేశాలను మెషిన్ల సాయంతో ఆరబెట్టినప్పటికీ.. ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. అందునా, మరికొన్ని నిమిషాల్లో ఆట ప్రారంభం కానుంది అన్న సమయాన వరుణుడు ఎంట్రీ ఇచ్చాడు. దీంతో మ్యాచ్ నిర్వహణ సాధ్యపడకపోవడంతో అంపైర్లు ఆటను రద్దు చేశారు. ఇరు జట్లకు చెరొక పాయింట్ కేటాయించారు.

### సూపర్-8కు అమెరికా.. ఇంటికి పాక్

మ్యాచ్ రద్దవ్వడంతో అమెరికా ఖాతాలో ఒక్క పాయింట్ చేరింది. దీంతో 5 పాయింట్లతో లీగ్ స్టేజ్‌ను ముగించి సూపర్-8కి అర్హత సాధించింది. చివరి మ్యాచ్‌లో పాకిస్తాన్.. ఐర్లాండ్(జూన్ 16)తో తలపడనుంది. అందులో గెలిచినా.. వారి ఖాతాలో 4 పాయింట్లు మాత్రమే చేరతాయి. దీంతో దాయాది జట్టు పోరాటం లీగ్ దశలోనే ముగిసింది. ఈ టోర్నీలో ఇప్పటివరకూ ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, భారత్, వెస్టిండీస్, ఆఫ్ఘనిస్తాన్, అమెరికా జట్లు అధికారికంగా సూపర్ 8కు అర్హత సాధించాయి. ఇక ఒమన్, నమీబియా, శ్రీలంక, న్యూజిలాండ్, పాకిస్తాన్ టోర్నీ నుంచి నిష్క్రమించగా.. మరో రెండు జట్లు బంగ్లాదేశ్, ఇంగ్లాండ్ డేంజర్ జోన్‌లో ఉన్నాయి.

# సమరోత్సాహంతో భారత్

## నేడు కెనడాతో చివరి పోరు



**ఫ్లోరిడా :** టీ20 ప్రపంచకప్‌లో భాగంగా శనివారం కెనడాతో జరిగే గ్రూప్‌ఏ లీగ్ మ్యాచ్‌కు టీమిండియా సమరోత్సాహంతో సిద్ధమైంది. భారత్ ఇప్పటికే సూపర్8కు అర్హత సాధించింది. చివరి లీగ్ మ్యాచ్‌లోనూ గెలిచి రానున్న నాకౌట్ సమరానికి ఆత్మవిశ్వాసంతో సిద్ధం కావాలని భావిస్తోంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో భారత్ సమతూకంగా కనిపిస్తోంది. టీమిండియా ఇప్పటికే వరుసగా మూడు మ్యాచుల్లో గెలిచి అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆఖరి మ్యాచ్‌లో కూడా జయభేరి మోగించాలనే పట్టుదలతో పోరుకు సిద్ధమైంది. కెనడా ఇప్పటి వరకు మూడు మ్యాచ్‌లు ఆడగా ఒకదాంట్లో మాత్రమే విజయం సాధించింది. చివరి మ్యాచ్‌లో భారత్ వంటి బలమైన జట్టుకు ఎలాంటి పోటీ ఇస్తుందో చెప్పలేం. ఇక టీమిండియా వరుస విజయాలతో జోరుమీదుంది. తొలి మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై, రెండో మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై జయభేరి మోగించింది. ఇక యూఎస్‌ఎతో జరిగిన కిందటి మ్యాచ్‌లోనూ అలవోక విజయాన్ని అందుకుంది. కెనడాపై కూడా గెలిచి లీగ్ దశలో అజేయంగా నిలువాలనే లక్ష్యంతో ఉంది.

### అందరి కళ్లు కోహ్లిపైనే..

మరోవైపు ఈ మ్యాచ్‌లో అందరి కళ్లు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లిపై నిలిచాయి. ఇప్పటి వరకు మూడు మ్యాచ్‌లు ఆడిన కోహ్లి మూడింటిలోనూ విఫలమయ్యాడు. ఐర్లాండ్‌పై ఒక పరుగు చేసిన విరాట్ పాకిస్థాన్, యూఎస్‌ఎలపై ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. ఈ మ్యాచ్‌లోనైనా అతను తన బ్యాట్‌కు పని చెబుతాడా లేదా అనేది అందరిలోనూ ఆసక్తి రేకెత్తిస్తోంది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే సత్తా కలిగిన కోహ్లి విజృంభిస్తే భారత్‌కు తిరిగే ఉండదు. మూడు మ్యాచుల్లోనూ కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన కోహ్లి ఒక్కదాంట్లో కూడా సత్తా చాటలేక పోయాడు. వరుసగా రెండు మ్యాచుల్లో సున్నాకే వెనుదిరిగాడు. ఈ మ్యాచ్‌లోనైనా బ్యాట్‌కు పని చెబుతాడా లేదా అనేది సందేహంగా మారింది. మరోవైపు కెప్టెన్ రోహిత్ శర్మ, వికెట్ కీపర్ రిషబ్ పంత్, సూర్యకుమార్‌లు భారత్‌కు కీలకంగా మారారు. తొలి మ్యాచ్‌లో రోహిత్ 52 పరుగులు చేశాడు. ఇక యూఎస్‌ఎతో జరిగిన కిందటి మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ అజేయ అర్ధ శతకం సాధించాడు. ఈసారి కూడా అతనిపై జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. రిషబ్ పంత్ కూడా జట్టుకు కీలకంగా మారాడు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే సత్తా కలిగిన రిషబ్ విజృంభిస్తే ప్రత్యర్థి జట్టు బౌలర్ల కష్టాలు రెట్టింపు కావడం ఖాయం. శివమ్ దూబె, హార్దిక్ పాండ్య, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ తదితరులపై కూడా జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. ఇదిలావుంటే బౌలింగ్‌లో మాత్రం టీమిండియా సమతూకంగా కనిపిస్తోంది. బుమ్రా, అర్ష్‌దీప్, సిరాజ్, హార్దిక్, అక్షర్, జడేజా వంటి మ్యాచ్ విన్నర్లు జట్టులో ఉన్నారు. కాగా కెనడా కూడా భారీ ఆశలతో పోరుకు సిద్ధమైంది.

ఇప్పటికే లీగ్ దశలో ఐరాండ్ ను ఓడించిన కెనడా ఈసారి కూడా మెరుగైన ప్రదర్శన చేయాలనే లక్ష్యంతో ఉంది. నికోలస్ కిర్టన్, వికెట్ కీపర్ శ్రేయస్ మెవ్వ, ఓపెనర్ అరోన్ జాన్స్, పర్గత్ సింగ్‌లతో కెనడా బ్యాటింగ్ బలంగా ఉంది. అయితే బలమైన భారత్‌తో పోరు కెనడాకు సవాల్ వంటిదేనని చెప్పాలి.

# పసికూనపై చెలరేగిన ఇంగ్లాండ్

- 3.1 ఓవర్లలోనే లక్ష్య ఛేదన
- తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో విజయం




**ఆంటిగ్వా :** ఆంటిగ్వా వేదికగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో పసికూన ఒమన్‌పై ఇంగ్లీష్ టీమ్ పంజా విసిరింది. ఒమన్ నిర్దేశించిన 48 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లండ్ రెండు వికెట్స్ కోల్పోయి 3.1 ఓవర్లలోనే ఛేదించింది. కెప్టెన్ జోస్ బట్లర్ (8 బంతుల్లో 24 నాటౌట్) ఒమన్ బౌలర్లపై విరుచుకు పడ్డాడు. ఈ విజయంతో ఇంగ్లండ్ సూపర్-8 ఆశలను సజీవం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఒమన్ 13.2 ఓవర్లలో 47 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లండ్ బౌలర్లు అదిల్ రషీద్ (4/11), మార్క్ వుడ్ (3/12), జోఫ్రా ఆర్చర్ (3/12) దెబ్బకు ఒమన్ బ్యాటర్లు వరుసగా పెవిలియన్ చేరారు. ఒమన్ బ్యాటర్లలో షోయబ్ ఖాన్ (23 బంతుల్లో 11) మాత్రమే రెండంకెల స్కోరు అందుకున్నాడు. ప్రతీక్ అథవాలే (5), కశ్యప్ (9), అకిబ్ ఇలియాస్ (8), జీషన్ మక్సూద్ (1), ఖలీద్ కైల్ (1), అయాన్ ఖాన్ (1) విఫలమయ్యారు. స్వల్ప ఛేదనలో ఇంగ్లండ్ 2 వికెట్లు కోల్పోయి 3.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని అందుకుంది. తొలి రెండు బంతులను ఫిల్ సాల్ట్ (3 బంతుల్లో 12) స్టాండ్స్‌కు తరలించాడు. మూడో బంతికి మరో షాట్‌కు యత్నించి ఔటయ్యాడు. ఆపై జోస్ బట్లర్ చెలరేగాడు. బౌండరీల వర్షం కురిపించాడు. వన్‌డౌన్‌లో వచ్చిన విల్ జాక్స్ (5) ఎక్కువసేపు క్రీజులో నిలవలేదు. జానీ బెయిర్‌స్టో ఆడిన రెండు బంతులను బౌండరీలకు తరలించడంతో ఇంగ్లండ్ భారీ విజయాన్ని అందుకుంది.

# సూపర్-8కు అఫ్గాన్




**ట్రినిడాడ్ :** టీ20 ప్రపంచకప్‌లో అఫ్గానిస్థాన్ టీమ్ సూపర్8కు అర్హత సాధించింది. గ్రూప్ సీలో భాగంగా పపువా న్యూగినియాతో జరిగిన మ్యాచ్‌లో అఫ్గాన్ ఏడు వికెట్ల తేడాతో జయకేతనం ఎగుర వేసింది. వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచిన అఫ్గాన్ గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచింది. ఇదే గ్రూప్ నుంచి ఆతిథ్య వెస్టిండీస్ కూడా సూపర్8కు దూసు కెళ్లింది. ఇక ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పపువా న్యూగినియా 19.5 ఓవర్లలో 95 పరుగులకే కుప్పకూలింది. అఫ్గాన్ బౌలర్లు అద్భుత బౌలింగ్‌తో ప్రత్యర్థి టీమ్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేశారు. జట్టులో ముగ్గురు మాత్రమే రెండంకెల స్కోరును అందుకున్నారు. ఓపెనర్ టోని (11), వికెట్ కీపర్ కిప్లిన్ డొరిగా (27), అలీ నావో (13) మాత్రమే డబుల్ డిజిట్ మార్క్‌కు చేరారు. అఫ్గాన్ బౌలర్లలో ఫజల్ హక్ ఫరూఖీ మూడు, నవీనుల్ హక్ రెండు వికెట్లు తీశారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన అఫ్గాన్ 15.1 ఓవర్లలో 3 వికెట్లకు 101 పరుగులు చేసి విజయం సాధించింది.

గుల్బదీన్ నైబ్ 4 ఫోర్లు, రెండు సిక్సర్లతో 49 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. మహ్మద్ నబి 16 (నా టౌట్) తనవంతు సహకారం అందించాడు.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. TELTEL02116